రాయచోటి ఈద్గాలో ముస్లింలతో కలిసి ప్రార్థనలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



త్యాగం, దానగుణాలకు ప్రతీక బక్రీద్

● ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, జూన్ 17: సహజ హితం కోసం మహమ్మద్‌ప్రవక్త హజరత్ ఇబ్రహీం త్యాగనిరతికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పండుగ త్యాగం, దాన గుణాలకు ప్రతీక అని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం బక్రీద్ పండుగ సందర్భంగా రాయచోటి పట్టణంలోని పాతరాయచోటికి సమీపంలో గల ఈద్గా మైదానంలో ముస్లింలు నిర్వహించిన సామూహిక ప్రార్థనల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూత్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగను ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు జరుపుకుంటారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉండాలని, సంక్షేమ పాలనలో ముఖ్యమంత్రికి అల్లా ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి మనిషి తనకు ఉన్నంతలో తోటి మనిషికి సాయం అందించే స్వభావాన్ని అలవర్చుకోవాలని మంత్రి ప్రజలకు సందేశమిచ్చారు. బక్రీద్ ప్రార్థన అనంతరం మంత్రి రాష్ట్ర ప్రజలతో పాటు జిల్లా ప్రజలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాయచోటి పట్టణంలోని ముస్లిం మత పెద్దలు, ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



రాయచోటి పట్టణంలోని ఈద్గాలో ప్రార్థనల్లో ముస్లింలు

కూతురే హంతకురాలు

● నిందితురాలు హరిత అరెస్టు

మదనపల్లె అర్బన్, జూన్ 17: కన్న కూతురే, తండ్రిని హత్య చేసిందని డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక వన్‌టౌన్ పోలీ‌స్‌స్టేషన్‌లో సోమవారం మీడియా సమావేశంలో హత్య కేసు వివరాలను వివరించారు. డీఎస్పీ కథనం మేరకు.. స్థానిక పీఅండ్‌టీ కాలనీకి చెందిన ఉపాధ్యాయుడు ఇ.దొరస్వామి (62)ని కుమార్తె హరిత ఈనెల 12వ తేదీ రాత్రి హత్య చేసింది. ప్రియుల మోజులో పడిన కుమార్తె, తండ్రి చూసిన పెళ్లి సంబంధాలను తిరస్కరిస్తోంది. ఈ విషయమై ఇద్దరి మధ్య కొంతకాలంగా వివాదం జరుగుతోంది. అలాగే హరిత మదనపల్లెకు చెందిన సాయికృష్ణ, రమేశ్, హరిష్‌రెడ్డిలతో చనువుగా ఉండటంతో తండ్రి దొరస్వామి కుమార్తెను పలుమార్లు మందలించాడు. ఈ క్రమంలో హరిత ప్రియుడిగా చెబుతున్న రమేశ్‌కు బంగారు నగలు ఇవ్వగా అతను బజాజ్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి రూ.11.40 లక్షలు తీసుకున్నాడు. అలాగే సాయికృష్ణకు రూ.8 లక్షల నగదు ఇచ్చిందన్నారు. అలాగే హరిష్‌రెడ్డితో కూడా చనువుగా ఉంది. ఉన్న డబ్బులు, బంగారం ఇచ్చేయగా తాను చూసిన పెళ్లి సంబంధాన్ని ఒప్పుకోకపోవడంతో తండ్రి, కూతురు తరచుగా గొడవ పడుతున్నారు. ఇందులో భాగంగా ఈనెల 12వ తేదీ ఇద్దరూ గొడవపడ్డారు. రాత్రి 10.30 గంటలకు గొడవపడే క్రమంలో మిద్దెపైన తాళం కప్పతో తండ్రి తలపై మోదింది. రక్త స్రావం కావడంతో దొరస్వామి కింద ఇంట్లోకి వచ్చి తనకు తగిలిన దెబ్బను చూడటానికి సెల్‌లో సెల్ఫీ వీడియో తీశాడు. అనంతరం మళ్లీ మిద్దెపైకి వెళ్లి మద్యం తాగి కూతురుతో మళ్లీ గొడవకు దిగాడు. కూతురు ఆవేశంతో రైటింగ్ ప్యాడ్‌తో, చపాతి రుద్దె కర్రతో, కరాటే స్టిక్‌తో విచక్షణారహితంగా కొట్టి హత్య చేసింది. రక్తపు మడుగులో పడి ఉన్న దొరస్వామిని చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే దొరస్వామి మృతి చెందాడు. మృతుడి బంధువు నారాయణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిందితురాలు హరితను అరెస్టు చేయడంతో పాటు హత్యకు ఉపయోగించిన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో మదనపల్లె వన్‌టౌన్ సీఐ వల్లిబసు, రూరల్ సీఐ శేఖర్, వన్‌టౌన్ సీఐ యువరాజు పాల్గొన్నారు.



నిందితురాలు హరిత (ఫైల్)



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి



● అప్పులు చేసి..ఖర్చులు పెట్టి..
● ఇప్పటికే రూ.1.10 కోట్లు విడుదల
● మరో రూ.2 కోట్లకుపైగా బకాయి
● నిధుల కోసం ఏఆర్‌వోల నిరీక్షణ
● టీఏ, డీఏలకు ఉద్యోగుల ఎదురుచూపు

ఎన్నికలంటే ఆషామాషీ కాదు..పోలింగ్ అంటే సామాన్య విషయమూ కాదు. ఈ ప్రక్రియ అంతా వ్యయ, ప్రయాసాలతో కూడుకున్న పని. ఎందరో సిబ్బంది.. ఎంతోమంది అధికారులు సమష్టిగా పనిచేస్తే తప్ప ఆ క్రతువును పూర్తి చేయలేరు. ఇందుకు ముఖ్యంగా డబ్బులు కూడా అవసరం. ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తుంది. మార్కెట్‌లోని ధరలు, బాడుగలకు అనుగుణంగా ఒక్కో నియోజకవర్గానికి కనిష్ఠంగా రూ.కోటి, గరిష్ఠంగా రూ.2 కోట్లు కేటాయిస్తుంది. ఈ నిధులను కూడా విడతల వారీగా విడుదల చేస్తుంది. ఇందులో భాగంగా 2024 సాధారణ ఎన్నికలకు ప్రభుత్వం ఇప్పటికే నాలుగు విడతలుగా ఒక్కో నియోజకవర్గానికి రూ.1.10 కోట్ల నుంచి రూ.1.25 కోట్ల వరకూ విడుదల చేసింది. ఇంకా రూ.2 కోట్లకుపైగా నిధులు కావాలని ఆయా నియోజకవర్గ కేంద్రంలోని తహసీల్దార్లు (ఏఆర్‌వో) కలెక్టర్‌కు అప్పుల చిట్టా పంపారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే ఇస్తామని కలెక్టరేట్ అధికారులు చెబుతుండగా, ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బంది నుంచి అధికారులు, ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయినప్పటి నుంచీ పోలింగ్ ముగిసి, కౌంటింగ్ పూర్తయ్యే వరకూ అక్కడ ఏర్పాట్లు చేపట్టిన వివిధ ఏజెన్సీలు సొమ్ముల కోసం అటు అధికారులు, ఇటు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అధికారులను ప్రశ్నిస్తే ఇప్పటికే వచ్చిన డబ్బులు ఖర్చు అయిపోయాయని, కలెక్టర్ నుంచి రాగానే ఇస్తామని చెప్పి పంపుతున్నారు.

ఎన్నికల డబ్బులు ఎప్పుడిస్తారో?

మదనపల్లె, జూన్ 17: జిల్లాలో మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో సాధారణ ఎన్నికలకు ఒక్కో కేంద్రానికి మండలాలు, పోలింగ్ కేంద్రాలను బట్టి రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు డబ్బులు ఖర్చు చేసినట్లు ఆయా నియోజకవర్గ కేంద్రాల తహసీల్దార్లు చెబుతున్నారు. అయితే ప్రభుత్వం ఇప్పటికే నాలుగు విడతలుగా రూ.కోటికిపైగా విడుదల చేసింది. ఈ నిధులను నియోజకవర్గ కేంద్రంలోని తహసీల్దార్‌ల ఖాతాకు బదిలీ చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయినప్పటి నుంచి పోలింగ్ కేంద్రాలలో చేపట్టిన ఏర్పాట్లు, ఎన్నికల సిబ్బంది, అధికారులకు కావాల్సిన సౌకర్యాలు, మీటింగులు, భోజన, రవాణా, తదితర ఖర్చులు పెట్టినట్లు చెబుతున్నారు. ఇందులో పెద్ద మొత్తంలో అవసరమయ్యే ఏజెన్సీలకు పాతిక, సగభాగం ఇచ్చి మిగిలిన మొత్తాన్ని అప్పులు పెట్టి పని కానిచ్చేశారు. కొందరు ఉన్న డబ్బులతో సర్దుబాటు చేయగా, ఇంకొందరు అప్పులు చేసి ఖర్చు పెట్టినట్లు కాకిలెక్కల చిట్టా కలెక్టర్‌కు పంపి నిధులు అడుగుతున్నట్లు విమర్శలు కూడా ఉన్నాయి.

సాధారణ ఎన్నికలకు పెట్టిన ఖర్చు ఎప్పుడొస్తుందోనని అధికారులు ఎదురు చూస్తుండగా, ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బంది, వివిధ స్థాయి అధికారులు వేతనం కోసం నిరీక్షిస్తున్నారు. నియోజకవర్గ స్థాయిలో తమకు రావాల్సిన నిధులకు సంబంధించి మండల స్థాయిలో ఏఆర్‌వో నుంచి ఆర్‌వోకు అక్కడి నుంచి కలెక్టర్‌కు అప్పుల చిట్టా పంపించగా, కింది స్థాయి సిబ్బంది, అధికారులు మాత్రం టీఏ, డీఏల పారితోషికం కోసం ఏఆర్‌వో చుట్టూ తిరుగుతున్నారు. వీరే కాదు పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్ల నుంచి ఎన్నికల సామగ్రి పంపిణీ వరకూ అక్కడ ఏర్పాటు చేసిన షామియానాలు, కుర్చీలు, కూలర్లు, మైక్‌సెట్లు, విద్యుత్ దీపాలు, టేబుళ్ల నిర్వాహకులకు డబ్బులు చెల్లించాల్సి ఉంది. అలాగే ఎన్నికల విధుల్లో పాల్గొన్న వివిధ స్థాయిల అధికారులకు వాహనాలు సమకూర్చడం, వాటికి అయ్యే డీజిల్, పెట్రోల్, వారు బసచేసే హోటళ్లు, లాడ్జీలు, భోజనాలు, సభలు, సమావేశాలకు అయ్యే చిన్నపాటి ఖర్చుల నుంచి భోజనాల వరకూ సొమ్ములు చెల్లించాల్సి ఉంది. ఇందులో మండల, మున్సిపాలిటీలలో ఏఆర్‌వోలు వీటిని ఏర్పాటు చేశారు. ముఖ్యంగా పోలింగ్ కేంద్రాలలో ర్యాంపుల నుంచి విద్యుత్తు, నీరు, మరుగుదొడ్ల వరకూ అన్ని వసతులూ కల్పించారు. కొన్ని కేంద్రాలలో అయితే అన్ని సౌకర్యాలు ఉండగా, మరికొన్ని సెంటర్లలో అరకొర, ఇంకొన్ని సెంటర్లలో పూర్తిగా లేవు. మండల స్థాయిలో సెక్టోరియల్ అధికారుల పర్యవేక్షణలో అన్నీ ఏర్పాటు చేయగా, పోలింగ్ రోజున మాత్రం ఓటర్లకు అనువుగా ఉండేందుకు బారికేడ్లు, షామియానాలు వేశారు. వీటిని ఏర్పాటు చేయడానికి కొన్ని చోట్ల బీఎల్‌వోలు, వీఆర్‌వోలకు బాధ్యతలు అప్పగించగా, మరికొన్ని చోట్ల మండల స్థాయి అధికారులు చేపట్టారు. ఇందుకు ఒక్కో పోలింగ్ కేంద్రంలో రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకూ ఖర్చు అయినట్లు చెబుతున్నారు. అయితే ఇందులో ప్రస్తుతం రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకూ ఇచ్చి అధికారులు చేతులు దులుపుకోగా, మరికొన్ని చోట్ల అప్పులు పెట్టి ప్రభుత్వం నుంచి సొమ్ములు వచ్చాక ఇస్తామని చెబుతున్నారు.

అయిదేళ్లకోసారి జరిగే ఎన్నికల ఖర్చుకు సంబంధించి ఆడిట్ ఉండదు. పెద్దమొత్తంలో తినేయడం, స్వాహా చేయడం సర్వసాధారణమైంది. కార్యాలయ అధికారులు, సిబ్బంది చేత పనులు చేయించడం, త్రుణమో, ఫణమో ఇచ్చి వారి వాహనాలను వినియోగించుకుని, వాటిని అద్దెకు తీసుకున్నట్లు నాలుగింతలు బిల్లు పెడుతున్నారనే ఆరోపణలున్నాయి. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల కేంద్రంగా ఎన్నికలకు సంబంధించి అధికారులు, సిబ్బందికి జరిగిన అవగాహన సదస్సులు, శిక్షణ తరగతుల విషయంలో నామమాత్రంగా సౌకర్యాలు, ఏర్పాట్లు చేపట్టి, అక్కడకు వచ్చిన వారికి భోజనం, స్నాక్స్ విషయంలో సక్రమంగా పెట్టలేదని విమర్శలు ఎక్కువగా వచ్చాయి. కానీ బిల్లుల విషయానికొచ్చే సరికి ఖర్చు ఒకింత అయితే, నాలుగింతలు అయిందని ఏజెన్సీల నుంచి కొటేషన్లు తీసుకొచ్చి క్లయిమ్ చేస్తున్నట్లు ఆరోపణలు ఎక్కువగా ఉన్నాయి. ఒక మదనపల్లెలోనే కాదు అన్ని కేంద్రాలలోనూ అదే పరిస్థితి. ఈ లెక్కలకు ఆడిట్, జవాబుదారీతనం లేకపోవడం, బిల్లు పెట్టినంతా ఇస్తారని గ్యారెంటీ లేకపోవడం, నిజంగా ఖర్చు చేసినంతే బిల్లు పెట్టినా వెంటనే వస్తుందనే నమ్మకం లేకపోవడం, తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ఒకటికి నాలుగింతలు పెడుతున్నట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. వచ్చే డబ్బు కూడా ఒకేసారి కాకుండా విడతల వారీగా రావడం, తదితర కారణాలను తెరపైకి తెస్తున్నారు. ముఖ్యంగా ఇప్పుడున్న అధికారులంతా ఎన్నికల విధుల నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి బదిలీపై వచ్చినవారే. ఈనెలాఖరులోగా వారంతా తిరిగి పూర్వస్థితికి వెళ్లే అవకాశం ఉంది. ప్రభుత్వం ఇచ్చే ఈ డబ్బులు ఎప్పుడో వస్తే తమకేంటి లాభం అనే రీతిలో దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కదిద్దుకోవాలనే చందంగా ఇప్పటికే విడుదలైన నిధుల నుంచే సర్దుబాటు చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఒక్కో నియోజకవర్గంలో ఎన్నికల విధుల్లో వీఆర్‌ఏ నుంచి కౌంటింగ్ అధికారి వరకూ వెయ్యి మంది పాల్గొన్నారు. వీరిలో పోలింగ్, కౌంటింగ్‌లో పాల్గొన్న అధికారులు, సిబ్బందికి మాత్రమే డబ్బులు ఇవ్వగా అంతకు ముందు జరిగిన ప్రక్రియలో పాలుపంచుకున్న సగం మందికి సగం లేదా అంతకంటే తక్కువ సొమ్ములు ఇచ్చి చేతులు దులుపుకోగా, మిగిలిన వారందరికీ ఇప్పటి వరకూ పైసా ఇవ్వలేదని బాధితులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా 2019లో ఎన్నికలు పూర్తయిన ఏడాది తర్వాత నిధులు వచ్చాయి. అప్పటికే కొందరు అధికారులు మారిపోయారు. వచ్చిన నిధులు కూడా డివిజన్ స్థాయిలో అప్పటి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పనిచేసిన సీసీ స్వాహా చేశాడని ఫిర్యాదులు రావడంతో విజిలెన్స్ విచారణ కూడా చేపట్టారు.



బీసీ గురుకుల ప్రవేశాలకు రెండు విడతలుగా పరీక్షలు

● ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాల్లో ఒక్కో సెంటర్ మాత్రమే

కలికిరి, జూన్ 17: జ్యోతీబా పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాల కోసం ముందు ప్రకటించినట్లు కాకుండా రెండు విడతల్లో ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నారు. మొదట ప్రకటన మేరకు ఈనెల 20న ప్రవేశ పరీక్షలు జరగాల్సి ఉండగా ప్రస్తుతం 21వ తేదీ కూడా పరీక్షలు నిర్వహించనున్నారు. అయితే పరీక్షా కేంద్రాలు మాత్రం ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాలో ఒక్కో కేంద్రంలో మాత్రమే జరగనున్నాయి. చిత్తూరు జిల్లాలోని బీసీ గురుకుల పాఠశాలల ప్రవేశాల కోసం కలికిరి, కడప జిల్లాలోని పాఠశాలలకు నందలూరులో మాత్రమే పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి గతంలో ఈ పాఠశాలలకు జరిగిన అడ్మిషన్లు పోనూ మిగులు సీట్ల భర్తీ కోసం ఇటీవల ప్రకటన జారీ చేశారు. అయితే పదుల సంఖ్యలో ఉన్న ఖాళీల భర్తీ కోసం వేల సంఖ్యలో అనూహ్య రీతిలో దరఖాస్తులు రావడంతో రెండు విడతల్లో ప్రవేశ పరీక్షలు నిర్వహించక తప్పడం లేదని జిల్లా కన్వీనరు వై.సోమశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిత్తూరు జిల్లాలోని బాలికల కోసం కలికిరి, ఉదయమాణిక్యం, పీలేరు, పెద్దపంజాణి, పులిచెర్ల, బాలుర కోసం సదుం, సత్యవేడు, ఐతేపల్లె, తంబళ్లపల్లె (అంగళ్ళు), కుప్పంలోని పాఠశాలల్లో అడ్మిషన్లు కోరే విద్యార్థులకు కలికిరి కేంద్రంగా మాత్రమే పరీక్షలు జరపనున్నారు. అదే విధంగా కడప జిల్లాలోని బాలికల కోసం నందలూరు, వనిపెంట, తొండూరు, బాలురు కోసం జమ్మలమడుగు, కమలాపురం పాఠశాలల్లో ప్రవేశాలు కోరే వారికి నందలూరు కేంద్రంగా పరీక్షలు నిర్వహించనున్నారు. ఈనెల 20న 6, 8 తరగతుల వారికి, 21వ తేదీ 7, 9 తరగతుల్లో ప్రవేశాలు కోరే వారికి విడివిడిగా రెండు రోజులపాటు పరీక్షలుంటాయి. ఈ రెండు పరీక్షలు మధ్యాహ్నం 3 నుంచి 5.30 వరకూ జరుగతాయి. 3.10 గంటల తరువాత ఆలస్యంగా వచ్చే విద్యార్థులను అనుమతించరు. దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు హాల్ టికెట్లను ఆన్‌లైన్ ద్వారా మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలని, విడిగా పోస్టు ద్వారాగానీ, నేరుగా కానీ అభ్యర్థులకు పంపడం లేదని సోమశేఖర్ వివరించారు. గతేడాది చదివిన తరగతులకు సంబంధించిన సిలబస్ మేరకు తెలుగు 20, ఇంగ్లీషు 20, గణితం 20, సైన్సు 20, సోషియల్‌కు 20 మార్కుల వంతున కేటాయించినట్లు చెప్పారు. ప్రశ్నపత్రం ఆంగ్లంలో మాత్రమే ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలని ఏవైనా ఇతర సందేహాలుంటే 98852 25352, 87900 92069 నంబర్లలో సంప్రదించాలని సోమశేఖర్ కోరారు.

హీరోలు.. జీరోలు...
జీరోలు. హీరోలు



మల్లికార్జునరెడ్డి



అమర్‌నాథరెడ్డి



గంటా నరహరి

● రాజంపేటలో తల్లకిందులైన రాజకీయం
● ఓటమితో టీడీపీలో వైరాగ్యం
● ఎమ్మెల్యే గెలిచినా వైసీపీలో నిరుత్సాహం
● ఎన్నికల ముందు వరకు ఒక్క వెలుగు వెలిగిన నేతలు
● ఎన్నికల తర్వాత రాజకీయ ఎదురీత



బాలసుబ్రమణ్యం



అరవ శ్రీధర్



ముక్కా రూపానందరెడ్డి

రాజంపేట, జూన్ 17: రాజకీయాల్లో ఓడలు బండ్లు అవ్వడం.. బండ్లు ఓడలు అవ్వడం సర్వసాధారణం. అదే క్రమంలో ఏ నాడూ ఎన్నికలకు ముందు కానరాని నేతలంతా హీరోలు అవ్వడం, ఎన్నికల్లో అనేక రాజకీయ ఒడిదుడుకుల వల్ల ఓ వెలుగు వెలిగి హీరోలుగా ఉన్నవారు జీరోలు అవుతుంటారు. ఆ క్రమంలో రాజంపేట నియోజకవర్గంలో ఎన్నికల తర్వాత రెండు పార్టీల్లోనూ నిరుత్సాహం కనపడుతోంది. ప్రధానంగా రాష్ట్రమంతా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయదుందుభి మోగించి చరిత్ర సృష్టించగా రాజంపేటలో టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం ఓటమి చెందడంతో ఆ పార్టీ నియోజకవర్గంలో నిరాశ, నిస్పృహలకు లోనైంది. రాష్ట్రమంతా తాము అధికారంలోకి వచ్చామన్న ఆనందం వీరిలో కనబడడం లేదు. కారణం రాజంపేట ఎమ్మెల్యే స్థానాన్ని గెలవలేకపోవడం వల్లే టీడీపీ క్యాడర్‌లో ఉత్సాహం లేకుండాపోయింది. రాజంపేటలో ఆకేపాటి అమర్‌నాథరెడ్డి వైసీపీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. అయితే రాష్ట్రంలో వైసీపీ కుప్పకూలిపోవడంతో రాజంపేటలో ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపొందినా వైసీపీ క్యాడర్‌లో ఆనందం లేకుండా పోయింది. అధికారంలోకి వచ్చిన టీడీపీకి రాజంపేట సీటు గెలవకపోవడంతో ఎంత నిరాశకు గురైందో, ఎమ్మెల్యే స్థానం గెలుపొందిన వైసీపీకి రాష్ట్రంలో అధికారం రాకపోవడంతో అదే నిరుత్సాహం నెలకొంది. ఈ విధంగా ఇరుపార్టీల క్యాడర్ రాజంపేట నియోజకవర్గంలో పూర్తిగా రాజకీయ నిస్తేజంలో ఉంది.

ఎన్నికల ముందు వరకు హీరోలుగా ఓ వెలుగు వెలిగిన నేతలు ఎన్నికల తర్వాత జీరోలుగా మారారు. రాజంపేట టీడీపీ ఎంపీ అభ్యర్థిగా గంటా నరహరిని చంద్రబాబు స్వయంగా ప్రకటించడంతో ఆయన ఏడాదిన్నరపాటు పార్లమెంట్ పరిధిలో ఓ వెలుగు వెలిగారు. ఎన్నికల్లో ఆయనకు ఏ టిక్కెట్ రాకపోవడంతో ఆయన ఇప్పుడు జీరోగా మారారు. అర్థబలం, అంగబలంలో మేటిగా నిలిచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన మాజీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి జిల్లాలోనే ఓ వెలుగు వెలిగారు. ఒకసారి టీడీపీ తరపున, మరోసారి వైసీపీ తరపున ఆయన ఎమ్మెల్యేగా కొనసాగారు. టీడీపీ హయాంలో జిల్లాలో ఎమ్మెల్యేగా గెలుపొందింది మేడా ఒక్కరే. అధికార టీడీపీలో ఆయన ఒక్కరు గెలిచి ఉమ్మడి కడప జిల్లాలో ఏకఛత్రాధిపత్యం వహించారు. మొన్న జరిగిన ఎన్నికల్లో మూడోసారి ఆయన తిరిగి పోటీ చేస్తారని ప్రచారం కూడా జరిగింది. ఇంతలో ఆయనకు టిక్కెట్ ఇవ్వడంలో వైసీపీ మొండిచేయి చూపింది. ఆయన తమ్ముడు మేడా రఘునాథరెడ్డికి రాజ్యసభ స్థానం ఇచ్చారు. ఇక టిక్కెట్ రాని మేడా ప్రస్తుతం మాజీగా మారిపోయి ఆయన రాజకీయం నేడు ప్రశ్నార్థకంగా మారిపోయింది. రాజంపేట టీడీపీ మాజీ ఇన్‌చార్జ్‌కి టీడీపీ ఎమ్మెల్యే టిక్కెట్ వస్తుందని భావించారు. ఆయనకు టిక్కెట్ రాకపోవడంతో ఆయన రాజకీయ పరిస్థితి కూడా తారుమారైంది.

రైల్వేకోడూరులో టీడీపీ ఇన్‌చార్జ్‌గా సుమారు 15 సంవత్సరాలు కొనసాగి కోడూరు రాజకీయాల్లో ఓ వెలుగు వెలిగిన కస్తూరి విశ్వనాథనాయుడుకు ఎన్నికల ముందు ఇన్‌చార్జ్ పదవి నుంచి తొలగించడంతో టీడీపీ అధికారంలోకి వచ్చిన సమయంలో ఆయనకు నియోజకవర్గ పగ్గాలు లేకుండా పోయాయి. ఇదే క్రమంలో ఇంజనీరింగ్ చదివి సర్పంచిగా ఉన్న అరవ శ్రీధర్ అనూహ్యంగా కోడూరులో జనసేన తరపున ఎమ్మెల్యేగా గెలుపొంది నేడు రాజకీయ హీరోగా మారిపోయారు. ఆయన గెలుపులో కీలక పాత్ర పోషించి కోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ బాధ్యతలను ఎన్నికలకు ముందు తీసుకుని నేడు రైల్వేకోడూరు రాజకీయాల్లో అనూహ్యంగా ముక్కా రూపానందరెడ్డి రాజకీయ హీరోగా మారిపోయారు. ఈ విధంగా ఎన్నికల తర్వాత రాజంపేట, కోడూరుల్లో రాజకీయ ముఖచిత్రమే మారిపోయింది. హీరోలుగా ఉన్న నేతలు జీరోలుగా... జీరోలుగా ఉన్న నేతలు హీరోలుగా మారిపోయారు.

విద్యుత్ తీగలు తగులుకుని లారీ దగ్ధం

● బొప్పాయి కార్మికురాలు మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు
● ప్రాణభయంతో లారీ నుంచి దూకేసిన బొప్పాయి కార్మికులు
● తప్పిన పెనుప్రమాదం



పూర్తిగా కాలిపోయిన లారీ



మృతి చెందిన మంజుల

రైల్వేకోడూరు, జూన్ 17: విద్యుత్ తీగలు తగులుకుని సోమవారం బొప్పాయి లారీ దగ్ధమైంది. ఈ సంఘటనలో బొప్పాయి కార్మికురాలు మృతి చెందగా, మరో కార్మికురాలికి తీవ్రగాయాలయ్యాయి. రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట వడ్డిపల్లె వద్ద ఓ స్టీల్ ఫ్యాక్టరీ వద్ద బొప్పాయి కాయల కోసం లారీ కూలీలను తీసుకుని వెళ్లింది. అక్కడక్కడా కోతలు చేసుకోగా అర్ధలారీ కాయలను కార్మికులు లోడ్ చేశారు. మరో చోటకు వెళ్లి కాయలను పూర్తి లోడ్ చేయడానికి వెళుతున్న సమయంలో లారీ పైభాగంలో టార్పాలిన్ పట్ట సగానికి కప్పి ఉండగా గాలికి పట్ట లేచి హైటెన్షన్ విద్యుత్ తీగలకు తగులుకుంది. దీంతో లారీకి విద్యుత్ ప్రసరించి లారీ మొత్తం కాలిపోయింది. లారీకి విద్యుత్ షాక్ అయి కాలిపోతున్న సమయంలో సుమారు 30 మంది బొప్పాయి కార్మికులు లారీలో ఉన్నారు. అందరూ తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని కిందకు దూకేశారు. చివరలో చిక్కుకున్న మంజుల (38) విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితిలో పడిపోయింది. ఆమెను వెంటనే రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మంజుల చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రమాదంలో వెంకటసుబ్బమ్మతో పాటు మరో ఇరువురికి తీవ్రంగా గాయాలయ్యాయి. రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించుకుని మెరుగైన చికిత్స కోసం తిరుపతిలోని ప్రైవేట్ ఆస్పత్రికి వారిని తరలించారు. సమాచారం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఏఈ యోగానందం తన సిబ్బందితో సంఘటన జరిగిన ప్రాంతంలో పరిశీలించారు. జరిగిన సంఘటనపై విద్యుత్ ఏడీ జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం పంపించారు. ఈ ప్రమాద సంఘటన తెలుసుకున్న రైల్వేకోడూరు అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వెళ్లి మంటలను అదుపు చేశారు. మృతురాలు మంజుల, గాయపడిన వెంకటసుబ్బమ్మ కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం తుగ్గలి మండలం సూర్యతాండాకు చెందిన వారు. వీరు కొన్నేళ్లుగా రైల్వేకోడూరులో బొప్పాయి కూలీలుగా పని చే స్తున్నారు. మంజుల భర్త శంకర్‌నాయక్ కూడా బొప్పాయి కూలీగా పని చేస్తున్నారు. మృతురాలికి చిన్నానాయక్, జాన్సీనాయక్, రవీంద్రనాయ క్, జశ్వంత్‌నాయక్ అనే పిల్లలు ఉన్నారు. మంజుల మృతి చెందిన సమాచారం తెలియగానే భర్త శంకర్‌నాయక్ శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ సంఘటన సమాచారం తెలిసిన బంధువులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలివచ్చారు. మంజుల మృతదేహం రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రి శవ పరీక్షా కేంద్రంలో ఉంచారు. సంఘటన తెలుసుకున్న పోలీసులు విచారించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వేకోడూరు ఎస్ఐ డాక్టర్ నాయక్ తెలిపారు. ఆదమరిచి ఉంటే భారీ ప్రమాదం జరిగి ఉండేదని బొప్పాయి కార్మికులు తెలిపారు. మంజుల, వెంకటసుబ్బమ్మలకు న్యాయం జరగాలని ఆస్పత్రికి చేరుకున్న బొప్పాయి కార్మికులు డిమాండ్ చేశారు. బొప్పాయి లారీకి నిప్పు అంటుకున్న సమయంలో లారీ డ్రైవర్, క్లీనర్ తదితరులు పరారీ అయ్యారని స్థానికులు తెలిపారు. బొప్పాయి కాయలను లోడుకు మించి వేయడంతోనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. బొప్పాయి వ్యాపారులు, మేస్త్రీలు శవ రాజకీయాలు చేస్తున్నారని కార్మికులు ఆరోపించారు.



విలపిస్తున్న మంజుల భర్త శంకర్ నాయక్, పిల్లలు

ఎదురుచూపులు ఇంకెన్నాళ్ళు?

- ఖరీఫ్‌లోనూ మొండి చెయ్యి
- సాగునీటి కోసం రైతుల ఎదురుచూపులు
- ప్రభుత్వం నిర్లక్ష్యం రైతులకు శాపం

సుండుపల్లె, జూన్17: ఖరీఫ్ సీజన్‌లో కళకళలాడాల్సిన పింఛా ప్రాజెక్టు వెలవెలబోతోంది. వైసీపీ హయాంలో పాలకుల నిర్లక్ష్యం అన్నదాతలకు శాపంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నివర్ తుఫాను కారణంగా 2020 నవంబర్-26వ తేదీన ప్రాజెక్టు మట్టికట్ట తెగిపోవడంతో దిగువ భాగంలో ఉన్న రైతుల మామిడి చెట్లు, పంట పొలాలు కొట్టుకుపోయాయి. పెద్ద సంఖ్యలో రైతులకు ఆస్తినష్టం వాటిల్లింది. అలాంటి రైతులను ఆదుకోవడం లోనూ వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ప్రాజెక్టు తెగిపోవడంతో అష్టకష్టాలు పడిన రైతులు రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి ఎదురైంది. సీపీఐ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ సమన్వయంతో వందలాది మంది రైతులు, ప్రజలు పింఛా ప్రాజెక్టు వద్ద నుంచి అన్నమయ్య జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వరకు సుమారు 40 కిలోమీటర్లు పాదయాత్ర చేయడంతో, ప్రాజెక్టు పనులు చేసేందుకు అనుమతులు వచ్చాయి. రూ.84.33 కోట్ల అంచనా వ్యయంతో 2023 మార్చి నెలలో పనులు ప్రారంభించారు. ఇప్పటికీ ఆ పనులు పూర్తి కాకపోవడం, ఖరీఫ్ సీజన్ మొదలవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. సకాలంలో వర్షాలు పడుతున్నా, నీరు వృథాగా ఏటి పాలవుతోంది. త్వరగా పనులు పూర్తి చేసి పుణ్యం కట్టుకోవాలని దిగువ ప్రాంతంలోని రైతులు కోరుతున్నారు.

ఏజెన్సీ ప్రాంతాల వరప్రసాదిని పింఛా ప్రాజెక్టు:
పింఛా, పెద్దినేనికాల్వ, రాయవరం, మాచిరెడ్డిగారిపల్లె ప్రాంతాల ప్రజలకు పింఛా ప్రాజెక్టు వరప్రసాదం లాంటిది. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో ఒకప్పుడు నాగరిక సమాజానికి దూరంగా ఉండే తాండాల దశ తిరిగింది. సుండుపల్లె మండలంలోని దాదాపు 15 గిరిజన తాండాల ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడినాయి. ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల కింద సుమారు 4,472 ఎకరాల సాగు భూమి ఉంది. ప్రాజెక్టు పూర్తై పూర్తి సామర్థ్యంతో నీటిని నింపితే ఏడాది పాటు రైతులు రెండు సార్లు పంటలు సాగు చేసుకునే వీలు ఉంటుంది.


మట్టికట్ట తెగిపోయిన చోట్ల పూర్తైన పనులు


పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న ఎడమకాలువ



ప్రాజెక్టు మట్టి కట్ట కొట్టుకుపోయిన ప్రదేశంలో 150 మీటర్లు కాంక్రీట్‌తో నాన్ ఓవర్‌ఫ్లో డ్యాం (ఎన్‌వోఎఫ్) పనులు పూర్తి అయ్యాయి. గతంలో ఉన్న మట్టి కట్ట స్థానంలో ఇప్పుడు పూర్తి స్థాయిలో కాంక్రీట్‌తో నిర్మించినట్లు అధికారులు చెబుతున్నారు. మట్టికట్ట తెగినప్పుడు ప్రాజెక్టు కుడికాలువ సుమారు 290 మీటర్లు కొట్టుకు పోయింది. ఆ ప్రదేశంలో ఇప్పుడు కాలువ నిర్మాణ పనులు జరుగుతు న్నాయి.

40 శాతం కుడికాలువ పనులు పూర్తి అయ్యాయి. రెండేళ్ల వ్యవధిలో ఈ పనులు పూర్తి చేయాల్సి ఉంది ప్రస్తుతం ప్రాజెక్టు పై ప్రాంతాల నుంచి భారీగా నీరు వస్తుండడంతో, ప్రాజెక్టుకు ఎటువంటి ప్రమాదం లేకుండా మరువ (అలుగు) ద్వారా నీరు నదిలోకి పోయేలా ఏర్పాట్లు చేశారు.

ఎడమ కాలువకు మరమ్మతులు చేయాలి



ఎడమ కాలువలో పిచ్చి మొక్కలు దర్శనమి స్తున్నాయి. ప్రాజెక్టు దిగువ నుంచి కాలువ మొత్తం చెత్తాచెదారంతో నిండిపోయి ఉంది. ముడుం పాడు క్రాస్ కురవపల్లి మధ్యలో కాలువ ధ్వంసం కావడంతో నీరు వృథా అయ్యే అవకాశం ఉంది. ప్రాజెక్టు పనులతో పాటు, కాలువ పనులు చేస్తే ఎంతో మేలు జరుగుతుంది. చివరి ఆయకట్టుకు నీరు అందుతుంది.

- చంద్రమోహన్, రైతు, కురవపల్లి

త్వరగా నీరు అందించాలి



ప్రాజెక్టు కుంగిపోవడం రైతులకు శాపంగా మారి ంది. త్వరగా కుడికాలువ మరమ్మతులు పూర్తి చేసి సాగునీరు అందించాలి. నాలుగేళ్ల నుంచి సాగుకు నీరు లేక బీడు భూములు దర్శనమిస్తు న్నాయి. కుడికాలువకు నీరు అందిస్తేనే రైతుల కడుపు నిండుతుంది. సాగునీరు రాక పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా త్వరగా పనులు పూర్తి చేయాలి

- వెంకటరమణనాయక్, రైతు, మిట్టవిడికి

రెండు నెలల్లో సాగునీరు

90 శాతం పనులు పూర్తయ్యాయి. రెండు నెలల్లో కుడి, ఎడమ కాలువలకు సాగునీరందిస్తాం. కుడికాలువ పనులు జరుగుతు న్నాయి. గేటు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రాజెక్టు ప్రధాన గేట్లకు మరమ్మతులు చేయాల్సి ఉంది. వచ్చే సంవత్సరంలో ఆ పనులు చేస్తాం. ప్రస్తుతం ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు త్వరిత గతిన పనులు పూర్తి అయ్యేలా చూడాలని ఉన్నతాధికా రుల నుంచి ఒత్తిడి ఉంది. త్వరగా పనులు పూర్తి చేస్తాం.

- వెంకట్రామయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

రౌడీ మూమూళ్ల కోసం దాడి ..

- బాధితుడి ప్రతిదాడి
- నలుగురికి గాయాలు





గాయపడిన వారు

జమ్మలమడుగు, జూన్ 17: రౌడీ మామూళ్ల కోసం నలుగురు వ్యక్తులు చేసిన దాడి యత్నం బాధితుడి ప్రతిదాడితో విఫలమైంది. దీంతో ఇరువర్గాలకు చెందిన నలుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు మైలవరం మండల కేంద్రానికి చెందిన కట్టె సుబ్బరాయుడు మార్కెట్‌యార్డు మాజీ వైస్‌చైర్మన్. ఈయన కొన్ని సంవత్సరాలుగా మైలవరం, జమ్మలమడుగు కట్టకింద మారెమ్మగుడి సమీపాన చేపల చెరువు నిర్వహిస్తున్నాడు. ఆయనకు సోమవారం మధ్యాహ్నం మైలవరం మండలం చిన్నకొమెర్ల గ్రామానికి చెందిన తిరుపాల్‌రెడ్డి, పుల్లారెడ్డితోపాటు మైలవరానికి చెందిన చంద్ర, వర్మ కారులో వచ్చి డబ్బు డిమాండ్ చేస్తూ బెదిరించారు. సుబ్బరాయుడు తిరగబడడంతో ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘటనలో సుబ్బరాయుడుకు తీవ్రంగా గాయపడగా, తిరుపాల్‌రెడ్డి, పుల్లారెడ్డికి తలకు గాయాలయ్యాయి. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. చుట్టుపక్కలవారు వారించడంతో, ఇరువర్గాలు ఎవరికి వారు ప్రభుత్వ ఆస్పత్రికి తరలివెళ్లారు. సమాచారం తెలుసుకున్న జమ్మలమడుగు అర్బన్ సీఐ కరుణాకర్, రూరల్ సీఐ గోపాల్‌రెడ్డి, ఎస్‌ఐలు, సిబ్బంది ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడారు. రూ. 20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో గొడవ జరిగిం దని కట్టె సుబ్బరాయుడు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా సీఐ కరుణాకర్ మాట్లాడుతూ డబ్బు కోసం గొడవ జరిగిందని, అన్ని కోణాల్లో విచారణ చేసి కేసులు నమోదు చేస్తామని విలేకరులకు తెలిపారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య


ప్రేమ్‌సాగర్ (ఫైల్)

పోరుమామిళ్ల, జూన్ 17: ఉద్యోగం రాకపోతే తన భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారు తుందన్న భయంతోపాటు, మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు ఓ యువకుడు. మండలంలోని అక్కల్‌రెడ్డిపల్లెకు చెందిన ప్రేమ్‌సాగర్ (22) అనే యువకుడు ఉద్యోగం రాలేదని మనస్తాపానికి గురై సోమవారం తెల్లవారుజామున సెల్‌టవర్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న అతని తండ్రి గురవయ్య, కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి వెళ్లి అతన్ని కాపాడే యత్నం చేశారు. అప్పటికే అతను మృతి చెందడంతో భోరున విలపించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేశారు. మృతుని తండ్రి గురవయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం సాయంత్రం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో అతని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

యూటీఎస్ కుటుంబ సంక్షేమ పథకం ట్రెజరర్‌గా లక్ష్మిరాజా

కడప (ఎడ్యుకేషన్), జూన్ 17 : కుటుంబ సంక్షేమ పథకం రాష్ట్ర ట్రెజరర్‌గా యూటీ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. నెల్లూరు పట్టణంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి స్మారక విజ్ఞాన కేంద్రంలో రెండు రోజులపాటు యూటీఎఫ్ రాష్ట్ర మధ్యంతర కౌన్సిల్ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో యూటీఎఫ్ రాష్ట్ర కుటుంబ సంక్షేమ పథకాన్ని పెట్టారని ఈ పథకానికి రాష్ట్ర ట్రెజరర్‌గా కడపజిల్లాకు చెందిన లక్ష్మిరాజాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేశ్‌బాబు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర కుటుంబ సంక్షేమ పథకంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు జిల్లా ఆఫీసు బేరర్లు సభ్యులుగా ఉంటారని ఇందులో సభ్యత్వం కలిగిన ఉపాధ్యాయులు మరణించినా, ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడినా అనారోగ్యంపాలైన ఆర్థికంగా ఆదుకుంటామని తెలిపారు.

అనాథ చిన్నారులకు ఎమ్మెల్యే పుట్టా అండ..


అనాథ చిన్నారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా

మైదుకూరు రూరల్ జూన్ 17 : స్థానిక పాతూరులో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన ముగ్గురు చిన్నారులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ హామీ ఇచ్చారు. నంద్యాల రోడ్డులోని ఈద్గా వద్ద పిల్లలతో పుట్టా సుధాకర్‌యాదవ్ మాటాడారు. వారి చదువుల విషయంతో తాను అండగా ఉంటానని తెలిపారు. వారి కుటుంబానికి ఎలాంటి సాయం అయినా చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని భరోసా ఇచ్చారు.

పులివెందులలో చోరీ

- రూ.19లక్షల విలువైన బంగారు రూ.40వేలు నగదు అపహరణ

పులివెందుల టౌన్, జూన్ 17: పులివెందులలోని ప్రశాంతి నగర్‌కు చెందిన ఉదయగిరి అల్లాబకాష్ అనే వ్యక్తి ఇంట్లో దుండగులు రూ.19లక్షల విలువైన బంగారు ఆభరణాలు, ఉంగరాలు, రూ.40వేలు నగదును ఎత్తుకెళ్లారు. బాధితుడు పోలీసులకిచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో అల్లాబకష్ ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి స్థానిక నగరిగుట్టలో ఉన్న తన తల్లి ఇంటికి వెళ్లాడు. 17వ తేదీన సాయంత్రం సుమారు 4గంటల సమయంలో తన ఇంటి తలుపు తెరిచి ఉన్నట్లు ఆ ఇంట్లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో అద్దెకు ఉంటున్న విష్ణువర్ధన్ అనే వ్యక్తి సమాచారం అందించడంతో అల్లాబకష్ హడావుడిగా ఇంటికి తిరిగి వచ్చి పరిశీలించగా బీరువాలోని దుస్తులు, వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతోపాటు, సుమారు 26తులాల ఆభరణాలు, రూ.40వేలు నగదు చోరీకి గురైనట్లు తెలిసింది. ఈ మేరకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో జూదరుల అరెస్టు

ఎర్రగుంట్ల, జూన్ 17: ఎర్రగుంట్ల మండలంలోని నిడుజువ్వి, పోట్లదుర్తిలో జూదమాడుతున్న రెండు వర్గాలను ఎర్రగుంట్ల పోలీసులు అరెస్టు చేశారు. నిడుజువ్వి కేంద్రంగా సాగుతున్న జూదకేంద్రంలో 16మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. వారి నుంచి రూ.72,750 స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. పోట్లదుర్తిలోని జూదకేంద్రంలో 8మందిని అదుపులోకి తీసుకుని రూ.24,960లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసునమోదు చేసి కోర్టుకు తరలిసున్నట్లు తెలిపారు. కాగా ఇటీవల జూదకేంద్రాల్లో బారీగా జూదమాడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

కంపెనీ డబ్బులు కాజేసిన కేసులో యువకుడి అరెస్టు

మదనపల్లె అర్బన్, జూన్ 17: స్థానిక దేవతా నగర్‌లోని ఓ కంపెనీలో డబ్బులు కాజేసి పరారైన కంపెనీ అసిస్టెంట్ మేనేజరు టి. రామచంద్ర (38)ను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ శేఖర్ తెలిపారు. తమిళ నాడు రాష్ట్రం, కరూర్ జిల్లా సెంబియనాధం గ్రామానికి చెందిన. రామచంద్ర అసిస్టెంట్ మేనేజరుగా పని చేస్తూ కలెక్షన్ బాయ్స్ తెచ్చిన కంపెనీ డబ్బులు రూ. 7లక్షలు తీసుకుని పరారయ్యాడు. ఈ సమ యంలో మేనేజరు 15 రోజులు సెలవులో ఉండడంతో కలెక్షన్ నగదు అతనికి ఇచ్చారు. ఇదే అదునుగా చూసుకుని నగదుతో అతను పరారయ్యాడు. తమిళ నాడు రాష్ట్రం, దిండుగల్లు జిల్లా చెందిన కె. కార్తీక్ (39)ఫిర్యాదు మేరకు రామచంద్రపై మే 30వ తేదీన కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. నిందితు డిన స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

త్రిశంకు స్వర్గంలో గోపాలమిత్రలు

- ప్రతిపక్ష నేతగా జగన్ హామీలు
- అధికారంలోకి వచ్చాక బెదిరింపులు
- ఐదేళ్లుగా ప్రోత్సాహకాలు నిలిపివేత
- టీడీపీ ప్రభుత్వంలో అయినా అందేనా?


కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు వేస్తున్న గోపాలమిత్ర

సంబేపల్లె, జూన్ 17: నాలుగేళ్లుగా ప్రోత్సాహకాలు చెల్లించకపోవడంతో గోపాలమిత్రలు ఇబ్బందులు పడుతున్నారు. 2001లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకృత్రిమ గర్భధారణ ద్వారా మేలు రకం పశుజాతిని పెంపొందించాలన్న ఉద్దేశంతో గోపాలమిత్ర వ్యవస్థను తీసుకొచ్చారు. తరువాత అధికారంలోకి వచ్చిన రాజశేఖర్‌రెడ్డి ఈ వ్యవస్థను ప్రోత్సహించారు. 2018లో ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి రాగానే గోపాలమిత్రల సమస్యలన్నీ రాగానే పరిష్కరిస్తామని చిత్తూరు జిల్లాలో ప్రజా సంకల్పయాత్ర సందర్భంగా 2018 జనవరి 13న హామీ ఇచ్చారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు నెలలు మాత్రం కృత్రిమ గర్భధారణకు ఇచ్చే ప్రోత్సాహకాలు అందించి, ఆ తర్వాత నిలిపివేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా కోట్ల రూపాయల మేర ప్రభుత్వం బకాయి పడింది. అప్పటి నుంచి గోపాలమిత్ర వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కక్ష సాధింపులకు గురి చేశారని గోపాలమిత్రలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజీనామాలు చేసి ఆఫీస్ సబార్డినేటర్ విధుల్లో చేరాలంటూ పైఅధికారులు ఒత్తిడి తెచ్చినట్లు చెబుతున్నారు.

గోపాలమిత్ర వ్యవస్థ ఏర్పాటు
కృత్రిమ గర్భధారణ ద్వారా మేలు రకపు పశు జాతిని పెంపొందించాలన్న ఉద్దేశంతో 2001లో టీడీపీ ప్రభుత్వం గోపాలమిత్ర వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఇంటర్ చదివి పశువైద్యంపై ఆసక్తి కలిగిన యువకులను ఎంపిక చేసి శిక్షణ ఇచ్చింది. పశువ్యాధుల నివారణ, కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు చేసేందుకు గౌరవ వేతనగా రూ.1000 ఇచ్చేవారు. 2004 అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2008లో గోపాలమిత్రలకు గౌరవ వేతనాన్ని రూ.1200 చేశారు. రాష్ట్ర విభజన అనంతరం అధికారంలోకి వచ్చిన టీడీపీ గౌరవ వేతనాన్ని రూ.6500కు పెంచుతూ అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జీవో విడుదల చేశారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 90 మంది గోపాలమిత్రలు ఉన్నారు. గోపాల మిత్రలకు గౌరవ వేతనం కూడా రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. దూడల ఇన్సూరెన్స్, కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు,నగదు ప్రోత్సాహక బహుమతులకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా కోట్లాది రూపాయలు నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వం నిలిపివేసింది. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి రావడంతో బకాయిలు అందుతాయన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అన్న క్యాంటీన్ ఏర్పాటుకు రంగం సిద్ధం

- భవనాన్ని ఖాళీ చేయనున్న విద్యుత్ శాఖ



పులివెందులలో అన్నక్యాంటీన్ (ఫైల్)




అన్నక్యాంటీన్ భవనంలో ఏర్పాటు చేసిన విద్యుత్ శాఖ కార్యాలయం

పులివెందుల రూరల్, జూన్ 17: తక్కువ ధరతో అల్పాహారం, భోజనం అందించే బృహత్తర లక్ష్యంతో నాటి తెలుగుదేశం ప్రభుత్వం పులివెందులలోని గాంధీ సర్కిల్‌లో రూ.36 లక్షల వ్యయంతో 2018 అక్టోబరు 2న అన్న క్యాంటీన్ ప్రారంభించింది. అన్నక్యాంటీన్‌లో రూ.5 అల్పాహారం, భోజనం అందిస్తుండడంతో ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. పట్టణానికి వచ్చిన సామాన్య, మధ్యతరగతి, పేదలకు అన్నక్యాంటీన్ ఉపయోగకరంగా ఉండేది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అన్నక్యాంటీన్లను మూసేసి, అన్నక్యాంటీన్ ముందు బస్‌షెల్టర్ ఏర్పాటు చేసింది. ఈ ఏడాది మార్చి నెలలో అన్న కాంటీన్ భవనంలో ఏపీఎస్పీడీసీఎల్ సబ్ డివిజన్ అధికారి కార్యాలయంఏర్పాటు చేశారు. మరో గదిని నిర్మించి, వెనుక కాంపౌండ్‌వాల్ నిర్మించారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో మళ్లీ అన్నక్యాంటీన్ తెరపైకి వచ్చింది. అన్న క్యాంటీన్లు పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనితో అన్న క్యాంటీన్ భవనాన్ని ఖాళీ చేయా లని విద్యుత్ శాఖ ఉత్తర్వులు అందినట్లు సమాచారం. ఈ విషయమై ఏపీఎస్పీడీసీఎల్ పులివెందుల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులును వివరణ అడగ్గా, వచ్చే నెల 1వ తేదీకల్లా ఖాళీ చేయాలని ఆదేశాలు వచ్చినట్లు తెలిపారు. దీంతో కార్యాలయాన్ని మినీ సెక్రటేరియట్ వద్దకు మార్చనున్నట్లు తెలిపారు.

కూటమి నేతలు, 'యువగళం'తోనే ఘనవిజయం

- చమర్తి జగన్‌మోహన్‌రాజు


టీడీపీ నాయకులు, కార్యకర్తలతో జగన్‌మోహన్‌రాజు

వీరబల్లి, జూన్ 17: ఎన్డీఏ అగ్రనేతలతో పాటు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌బాబు యువగళం పాదయాత్రతోనే ఈ ఘనవిజయాన్ని సాధ్యమైందని తెలుగుదేశం పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. సోమవారం వీరబల్లి మండల కేంద్రంలో ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడానే. అరాచక జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు నాడు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌బాబు యువగళం పాదయాత్ర చేపట్టి యువతను ఎన్డీఏ కూటమి వైపు ఆకర్షితులు అయ్యేలా చేశారన్నారు. యువగళం పాదయాత్రకు అడుగడుగునా జగన్ ప్రభుత్వం ఆటంకాలు కలిగిస్తూ విఫలం చేసేందుకు కొందరు పోలీసు అధికారులను ఉసికొల్పి అనేక ఇబ్బందులకు గురిచేశారన్నారు. యువగళం పాదయాత్ర చరిత్రలో నిలిచిపోయే ఒక మహత్తర ఘట్టమని ఆయన ప్రశంసించారు. దీంతో స్పందించి జనసేన, బీజేపీలు సంపూర్ణంగా మద్దతు ఇచ్చి జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించినట్లు ఆయన తెలిపారు. ఈ ఘన విజయంలో బీజేపీ అగ్రనేతలతో పాటు, జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ కూడా ప్రధాన భూమిక పోషించినట్లు ఆయన గుర్తు చేశారు. వీరి కలయికతోనే రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఎన్డీఏ కూటమికి అత్యధిక మెజార్టీ వచ్చిందన్నారు. ఈయన వెంట తెలుగుదేశం పార్టీ వీరబల్లి మండల అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీల అధ్యక్షుడు ఆంజనేయులురెడ్డి, ప్రసాద్‌రాజు, వీరామృతనాయుడు, మండల మహిళా అధ్యక్షురాలు నాగసుబ్బమ్మ, నాయకులు యర్రపురెడ్డి రాంమోహన్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, జయుడు, నందకుమార్‌నాయుడు, మదనపల్లె సుధాకర్, నాగప్పనాయుడు, శివ, ఫయాజ్, నాగమ్మ, తెలుగుదేశం పార్టీ ఎన్ఆర్ఐ నాయకులు నరసింహానాయుడు, తెలుగు యువత నాయకులు సాయికుమార్‌రాజు, వినయ్, రమణ, రాంమోహన్, మంజునాధ, మహేశ్, పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కుమార్తెను తీసుకెళ్లాడని దాడి

మదనపల్లె టౌన్, జూన్ 17: ప్రేమ పేరుతో తమ కుమార్తెను తీసుకెళ్లాడనే ఆగ్రహంతో ఓ యువకుడి కుటుంబంపై దాడి చేశారు. కురబలకోట మండల తెట్టు హరిజనవాడకు చెందిన వీరభద్ర(50), బయ మ్మ (45) కుమారుడు బాలరాజు(25) ఓ అమ్మాయిని ప్రేమించాడు. ఈ విషయమై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగాపోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇటీవల బాలరాజు ఆ అమ్మాయిని తీసుకెళ్లిపోయాడు. దీంతో ఆగ్రహించిన అమ్మాయి తరుపు వారు బాలరాజు తండ్రి వీరభద్ర, తల్లి బయమ్మ, అమ్మమ్మ వెంకటమ్మపై దాడి చేయగా, వారు మదనపల్లె ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ఈమేరకు అవుట్ పోస్టు పోలీసులు ముదివేడు స్టేషన్‌కు సమాచారం అందించారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి





చిట్వేలి: ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిం మైనార్టీ నాయకులు, సిద్దవటం: ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు, సుండుపల్లె: ప్రార్థనలు నిర్వహిస్తున్న మైనార్టీలు

త్యాగాలకు ప్రతీక బక్రీద్

రాయచోటి/లక్కిరెడ్డిపల్లె/గాలివీడు/రామాపురం/సంబేపల్లె/రాజంపేట/రైల్వేకోడూరు/సుండుపల్లె/చిట్వేలి/నందలూరు/ఒంటిమిట్ట/సిద్దవటం/జూన్17: త్యాగాలకు ప్రతీక అయిన బక్రీద్ పండుగను ముస్లింలు వేడుకగా నిర్వహించారు. చిన్న, పెద్ద తేడా లేకుండా భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్దలు పలు సందేశాలను బోధించారు.

లక్కిరెడ్డిపల్లె ఈద్గా వద్ద ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. పందిళ్లపల్లె, చింతకుంట పల్లె, దిన్నెపాడు దూదేకులపల్లె గ్రామాల్లోని మసీదుల్లో ప్రార్థనలు జరుపుకున్నారు.

గాలివీడు మండలంలోని నూలివీడు, గాలివీడు, కొర్లకుంట, పూలుకుంట, అరవీడు, వెలిగల్లు, తూముకుంట తదితర గ్రామాల్లోని ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

రామాపురం మండలంలోని రామాపురం, గువ్వలచెరువు, గోపగుడిపల్లి, నీలకంఠ్రావుపేట, సుద్దమళ్ల పంచాయతీలోని దూదేకుల పల్లి, కర్ణపువాండ్లపల్లె, గంగనేరు, బండపల్లి, చిట్లూర, కుమ్మరపల్లి పంచాయతీలోని దూదేకులపల్లి, నందలూరు వాండ్ల పల్లె, హసనాపురం గ్రామాల్లో సోమవారం ముస్లింలు ఘనంగా బక్రీద్‌ను జరుపుకున్నారు.

సంబేపల్లె మండలంలో ముస్లింలు ఘనంగా నిర్వహించారు. యర్రగుంట్ల, బాటవారి పల్లి, దేవపట్ల, దేవలంపేట, శెట్టిపల్లె గ్రామాల్లోని ఈద్గాల్లో మతగురువు ఆధ్వర్యంలో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు.

రాజంపేట పట్టణంలో సోమవారం బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈద్గాకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరినొకరు ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. పెద్దఎత్తున ఈద్గాలకు చేరి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

రైల్వేకోడూరు మండలంలో ఈద్గా వద్ద ఘనంగా బక్రీద్ పండుగను జరుపుకున్నారు. భారీ సంఖ్యలో ముస్లింలు పాల్గొని ఒకనినొకరు ఆలింగనం చేసుకున్నారు. మతపెద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

చిట్వేలి మండలంలోని గట్టుమీదపల్లె, తిమ్మాయపాలెం, నగిరిపాడు, కస్తూరువారిపల్లె గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనల అనంతరం పండుగను అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లె మండలంలో ఈద్గాల వద్ద ముస్లిం మైనార్టీలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని సుండుపల్లె, జీకేరాచపల్లె, మడతాడు, బెస్తపల్లి, రాయవరం, మడుంపాడుతో పాటు తిమ్మసముద్రం, భాగంపల్లి ఈద్గాల వద్ద పెద్ద సంఖ్యలో మైనార్టీలు చేరుకొని ప్రార్థనలు నిర్వహించారు.

నందలూరు మండలం నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ జామియా మసీదు ఈద్గాలో బక్రీద్ పండుగను సోమవారం భక్తిప్రవక్తులతో జరుపుకున్నారు. మండల కోఆప్షన్ సభ్యుడు కరిముల్లాఖాన్, ముస్లిం మైనార్టీ నాయకులు సయ్యద్ అమీర్‌లు పలువురికి శుభాకాంక్షలు తెలిపారు.

ఒంటిమిట్ట మండలంలో బక్రీద్ పండుగ పురస్కరించుకొని స్థానిక ఈద్గాలో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. మలకాటుపల్లి వద్ద ఉన్న మదరసాలు సుభాన్ ఆధ్వర్యంలో పెద్దత్తున ప్రార్థన నిర్వహించి బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో ముస్లింలు డీలర్ మస్తాన్, అమానుల్లా, షఫీ, సత్తార్, అజ్మతుల్లా, చాంద్‌బాషా పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

సిద్దవటం మండలంలోని సిద్దవటం, భాకరాపేట, కనుమలోపల్లె, మాదవరం-1, అలీనగర్, మాచుపల్లె, వంతాటిపల్లె, ఉప్పరపల్లె తదితర గ్రామాల్లో బక్రీద్ వేడుకలు జరిగాయి.



రైల్వేకోడూరు: ఈద్గా వద్ద భారీగా హాజరైన ముస్లింలు



లక్కిరెడ్డిపల్లె: ఈద్గా వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



చిన్నమండెం: ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

సీఐటీయూను బలోపేతం చేయడమే లక్ష్యం

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

రాయచోటిటౌన్, జూన్ 17: సీఐటీయూ సంఘాన్ని బలోపేతం చేయడమే కార్మిక ఉద్యమ నేత తెలంగాణ సాయుధ పోరాట యోధుడు పర్సా సత్యనారాయణకు మనం ఇచ్చే ఘనమైన నివాళి అని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ అధ్యక్షతన పర్సా సత్యనారాయణ శత జయంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పర్సా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సత్యనారాయణ, నండూరి ప్రసాద్‌రావులు ఇద్దరు కలిసి నిర్మించిన సంఘమే సీఐటీయూ అని తెలియజేశారు. నిర్మాణం కోసం చాలాకాలం వారు కృషి చేశారన్నారు. పర్సా ఆంధ్రప్రదేశ్ సీఐటీయూ అధ్యక్షుడి గానూ, గౌరవాధ్యక్షుడిగానూ, సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షుడిగానూ కార్మికుల లోకం సంపాదికుడుగానూ అనేక సంవత్సరాలు పనిచేశారని తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో సీఐటీయూ ఉద్యమం విస్తరించడానికి ఆయన చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. ఆయన తొమ్మిదేళ్లపాటు జైలు జీవితం అనుభవించారని గుర్తు చేశారు. శాసనసభ సభ్యులుగా కొనసాగుతూనే ఆ రోజుల్లో విశాఖ ఉక్కు కోసం శాసనసభ సభ్యత్వాన్ని త్యాగం చేసిన ఘనత పర్సాకే దక్కుతుందన్నారు. అనంతరం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని కార్మికులను కోరారు. ఈ సభలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి, ఉపాధ్యక్షుడు రవికుమార్, పి.శ్రీనివాసులు, వెంకట్రామయ్య, రాజేశ్వరి, రెడ్డెప్ప, శ్రీలక్ష్మి, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సుబ్రమణ్యంరాజు, భోగేశ్వరయ్య, సుజాత, పరంజ్యోతి, ప్రసాద్, గౌరీ, మధురవాణి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ రాష్ట్ర నేతలు

వేడుకగా ద్రౌపదీమాత కల్యాణోత్సవం

రామాపురం, జూన్ 17: మండల కేంద్రమైన రామాపురంలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా సోమవారం ద్రౌపదీమాత కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ద్రౌపదీమాత తరపున మద్దిరేవుల కుమారి, రమేశ్‌రెడ్డి దంపతులు పాండవుల తరపున అయోధ్యాపురం సరస్వతి, భగవాన్‌రెడ్డిలు పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవానికి మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి పాల్గొని ద్రౌపదీ మాత కల్యాణోత్సవాన్ని తిలకించి పండితులతో ఆశీర్వాదం పొందారు. ఈ కల్యాణోత్సవానికి మండలంలో ప్రజలు హాజరై కల్యాణ ఉత్సవాన్ని తిలకించి ఆ ద్రౌపదీమాత కృపా కటాక్షాలు పొందారు. ప్రతిరోజు మాదిరి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ

చిన్నమండెం, జూన్ 17: మండలంలోని వండాడి గ్రామ పంచాయతీ కడప- బెంగుళూరు జాతీయ రహదారిలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. హరిజనవాడ, గాండ్లపల్లికు వెళ్లే రహదారి పక్కన ఉన్న విలువైన నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమి సర్వేనెంబర్ 140/3లో అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించుకున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయమై రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ శ్రీనునాయక్‌ను వివరణ కోరగా ఆ భూమిని గతంలో పీవోటీ చేశారని, అందులోనూ అది హైకోర్టు పరిధిలో ఉందన్నారు. అయితే అది ఆక్రమణకు గురైనట్లు తమకు ఫిర్యాదు అందిందని, సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆక్రమణదారులపై కఠిన చర్యలు చేపడతామని ఆయన తెలిపారు.



ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి

భక్తిశ్రద్ధలతో నాగారపమ్మ తల్లి ఉత్సవాలు

సుండుపల్లె, జూన్ 17: మూడు రోజులుగా నాగారపమ్మ జాతర ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. పూజల్లో భాగంగా ఆలయ పూజారులు పుట్ట బంగారం తీసుకువచ్చి ఆలయంలో అమ్మవారికి సమర్పించారు. భక్తుల కోలాహలం మధ్య ఆలయ పూజారులు, యువకులు వెంట రాగా ఆసాది నాగసిద్దయ్య గొర్రెను తన భుజాలపైన వేసుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారి ఎదురుగా ఆలయ ముఖద్వారం వద్ద పూజారులు వేసిన గుర్రపు ముగ్గుపై నిలబడి తన భుజాలపై ప్రాణంతో ఉన్న గొర్రె మెడను బలిచ్చే కార్యక్రమం చేశారు. గావు కార్యక్రమం తిలకించడానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయప్రాంతం కిటకిటలాడింది.



అమ్మవారిని ఈడిగపల్లెకు తీసుకెళుతున్న భక్తులు

కల్లు సమర్పణ: జాతర ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని డప్పు వాయిద్యాల నడుమ వెండి పల్లకిలో ఊరేగింపుగా బండకాడ ఈడిగపల్లెకు తీసుకువెళ్లారు. గ్రామంలోని ఈడిగ కులస్తులు తమ సాంప్రదాయం ప్రకారం అమ్మవారికి కల్లుతో నిండిన ముంతను సమర్పించి తమ కుల భక్తి చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆసాది నాగసిద్దయ్య బృందం తమ కథలలో భాగంగా అమ్మవారిని దుర్భాషలాడడాన్ని భక్తులు ఆసక్తిగా విన్నారు. నాగారపమ్మకు ఆలయ ధర్మకర్త క్రిష్ణమూర్తి కుటుంబం సోమవారం మధ్యాహ్నం బెస్తపల్లి, నగిరి బాణం తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని అర్చనలు చేయించుకున్నారు.

వైభవంగా భవానీశంకర స్వామి తిరుణాళ్ల




ప్రత్యేక అలంకరణలో స్వామివారు, పూజా కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

చిట్వేలి, జూన్ 17: మండల పరిధిలోని నక్కలపల్లె గ్రామంలో వెలసి ఉన్న భవాని శంకరస్వామి తిరుణాల మహోత్సవాన్ని సోమవారం నిర్వాహకులు అత్యంత వైభవంగా ప్రారంభించారు. ఈ మేరకు ఉదయం ఆలయ అర్చకులు అరవింద్‌శర్మ, గోపూజ, గణపతిపూజ, స్వస్తివాహనం, కంకణదారణ, ధ్వజారోహణ, రుద్రాభిషేకం, అమ్మవారికి పంచామృతాభిషేకం, నవగ్రహారాధన, గణపతిహోమం, రుద్రహోమం, నవగ్రహ హోమం, పూర్ణాహుతి, మహానైవేద్యం అనంతరం మంగళహారతి తీర్థప్రసాదాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గణేష్ కమిటీ కువైత్ వారిచే మధ్యాహ్నం భారీఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని జరిపించారు. సాయంత్రం కన్నుల పండుగగా భవానిశంకర కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. మహిళలు పెద్దసంఖ్యలో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. రాత్రి ఆర్కెస్ట్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

117 జీవోను రద్దు చేయాలి : ఉపాధ్యాయ సంఘం

రాయచోటిటౌన్, జూన్ 17: జీవో-117ను రద్దు చేయాలని ఏపీ ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ బృందం సోమవారం రాయచోటి పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర యువజన, క్రీడ, రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అపస్ జిల్లాశాఖ అధ్యక్షుడు ఉపాధ్యాయుల సమస్యలపై మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా పాఠశాల విలీనానికి సంబంధించిన 117 జీవోను రద్దు చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని, అదేవిధంగా హెల్త్‌కార్డు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం అపస్‌రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగేశ్వరరావు, జిల్లా గౌరవాధ్యక్షుడు పరశురాం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు నాగయ్య, జిల్లా కార్యదర్శి చెన్నక్రిష్ణ, వివిధ మండలాల బాధ్యులు మధుసూదన్, రాజా, రాంప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన సత్యమ్మతల్లి తిరుణాల

చిట్వేలి, జూన్ 17: మండల కేంద్రమైన చిట్వేలి సత్యమ్మ వీధిలో వెలసి ఉన్న సత్యమ్మతల్లి తిరుణాల మహోత్సవం శనివారం మొదలుకొని సోమవారం ఘనంగా ముగిశాయి. ఈ మేరకు ఆదివారం రాత్రి చౌడవరం రంగారెడ్డి కుటుంబ సభ్యులు ఆర్కెస్ట్రా ఏర్పాటు చేయగా సోమవారం ఉదయం అంకిశెట్టి పెంచలయ్య కుమార్తె స్నేహ పుట్టిన రోజు సందర్భంగా ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం చౌడవరం, రఘురామిరెడ్డి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. తిరుణాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తావివ్వకుండా బందోబస్తు నిర్వహించిన ఎస్‌ఐ సుధాకర్ సిబ్బందిని, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. అనంతరం సాయంత్రం మేళతాళాలు, టపాసులు పేల్చుతూ పోతురాజును గ్రామోత్సవంలో యథాస్థానానికి తరలించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



కన్నుల పండువగా భవానిశంకర కల్యాణోత్సవం

కడప- బెంగుళూరు రైల్వేలైన్‌ను పూర్తి చేయాలి : సీపీఐ

రాయచోటి టౌన్, జూన్ 17: కడప- బెంగుళూరు రైల్వేలైన్ పనుల పూర్తికి నూతన ప్రభుత్వం చొరవ చూపాలని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ 2009లో ప్రారంభమైన కడప- బెంగుళూరు రైల్వేలైన్ కొంతమేర పనులు జరిగి అర్థాంతరంగా ఆగిపోయాయన్నారు. నాడు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం పూర్తిగా కడప- బెంగుళూరు రైల్వేలైన్ అసైన్మెంట్‌ను వారి సొంత ప్రాంతాలు మీదుగా ఏర్పాటు చేసుకున్నారని ఆరోపించారు. తద్వారా నూతనంగా ఏర్పడిన అన్నమయ్య జిల్లా ప్రాంత ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి జక్కల వెంకటేశ్, సీపీఐ నాయకులు ఎంఆర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

మాట తప్పని మహనీయుడు చంద్రబాబు

- దివ్యాంగుల సంక్షేమ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు రంగారెడ్డి

రాయచోటిటౌన్, జూన్ 17: మాట తప్పని మహనీయుడు సీఎం చంద్రబాబు అని దివ్యాంగుల సంక్షేమశాఖ రాష్ట్ర అధ్యక్షుడు వంగిమళ్ల రంగారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణం మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కార్యాలయంలో దివ్యాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డిలు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుంచి దివ్యాంగులకు రూ.6 వేలు పెంచి ఇవ్వాలని దివ్యాంగుల సంఘాలు ప్రభుత్వంపైన ఒత్తిడి తెచ్చి ఉద్యమాలు చేసినా గత వైసీపీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తే విధంగా వ్యవహరించిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చంద్రబాబు వృద్ధులకు, వితంతువులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు పింఛన్ ఇస్తామని చెప్పడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమశాఖ జిల్లా గౌరవాధ్యక్షుడు గణపతి, నాయకులు అన్వర్‌బాషా, రామచంద్రారెడ్డి, మణికంఠరెడ్డి, గువ్వలచెరువు రమణ, మేదరపల్లి రమణయ్య, మరికొంత మంది దివ్యాంగులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఏపీ దళితవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు

లక్కిరెడ్డిపల్లె, జూన్ 17: రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాదురెడ్డిని ఏపీ దళితవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులేసు సోమవారం కలిసి పుష్పగుచ్ఛం, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం దళితులకు న్యాయం జరిగేలా చూడాని ఆయన మంత్రిని కోరినట్లు తెలిపారు. లక్కిరెడ్డిపల్లె నుంచి బలిజ సంఘం నాయకులు, వెంకటేశ్వర్లు, విశ్వనాథ, పక్కీరయ్య, వెంకటక్రిష్ణయ్య, కావళి ఆంజనేయులు మంత్రిని కలిసి ఘనంగా సన్మానించారు. మంత్రి మాట్లాడుతూ అన్ని వర్గాలను టీడీపీ ప్రభుత్వం ఆదుకుంటుందని, ఎవరూ అధైర్య పడొద్దని హామీ ఇచ్చారు.

అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పెనగలూరు, జూన్ 17: మండల కేంద్రమైన పెనగలూరులో ఆదివారం రాత్రి నుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు అంకురార్పణ కార్యక్రమంతో ప్రారంభమయ్యాయి. ఆర్యవైశ్య సంఘంలోని పాలెంపల్లె కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తమ నివాసాల నుంచి మేళతాళాలతో పూజా సామగ్రిని తీసుకొని వేణుగోపాలస్వామి దేవాలయం చేరుకున్నారు. దేవాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించిన తర్వాత కట్టపైన ఉన్న పుట్ట నుంచి సంప్రదాయ పద్ధతిలో పూజా కార్యక్రమాలు జరిపి పుట్టమన్నును తీసుకువచ్చారు. అనంతరం ఆ మట్టిలో నవధాన్యాలను కలిపి కొత్తకుండలో దేవాలయ ప్రాంగణంలోని బొమ్మలను ఉంచారు. ఆ నవధాన్యాలు బ్రహ్మోత్సవాలు ముగిసే నాటికి విత్తనం విత్తి చిన్న మొలకలు తయారవుతాయి. ఆ మొలకలను గ్రామంలోని ప్రతి నివాసానికి ప్రసాదంగా అందజేస్తారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త జిలకర సుబ్బయ్య, దేవాలయ ప్రధాన కార్యకర్త సుబ్బనరసయ్యస్వామి, అర్చకులు శేఖర్‌స్వామి, సాయికుమార్‌స్వామి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా తిరుపతికి చెందిన రాధిక భాగవతారణిచే దేవాలయం ముఖద్వారా మండపంలో హరికథ గానం జరిగింది.

ప్రహరీగోడ నిర్మాణం అడ్డగింత

సుండుపల్లె, జూన్ 17: ప్రహరీగోడ నిర్మాణాన్ని సోమవారం ఉదయం రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. అప్పన్నకుంట మరువలో రాయచోటి ప్రధాన రహదారి సమీపంలోని వంకలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ జరీనాబేగం ఆదేశాలతో అడ్డుకున్నట్లు వీఆర్వో విజయలక్ష్మి తెలిపారు. సర్వేయర్ వచ్చి సర్వే చేసేంతవరకు నిర్మాణాలు చేసేందుకు అనుమతి లేదని తెలిపారు. అలా కాదని నిర్మాణాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఇదిలా ఉండగా మండల కేంద్రంలో వంక ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి కిరణ్‌కుమార్ నాయుడు పేర్కొన్నారు. ఆక్రమణలు తొలగించకపోతే మంగళవారం జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.



రెవెన్యూ అధికారులు ఆపిన ప్రహరీ గోడ నిర్మాణం

కొల్లు రవీంద్రను కలిసిన ఎమ్మెల్యే

ఓబులవారిపల్లె, జూన్ 17: మైన్స్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను విజయవాడలో సోమవారం సాయంత్రం రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానంద రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మంత్రి కొల్లు రవీంద్రతో పలు అంశాల మీద చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి, రాజుగుంట సర్పంచ్ గుత్తి నరసింహ తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే

వర్సిటీల్లో గందరగోళం

కీలక పదవుల్లోని అధికారులపై ఆరోపణలు
వైసీపీ నేతల అండతో ఇష్టారాజ్యంగా నిర్ణయాలు
ప్రభుత్వం మారడంతో పలువురి రాజీనామా
పదవుల్లో కొనసాగేందుకు కొందరి యత్నాలు
తప్పుకోమంటూ ఆందోళనలకు దిగుతున్న టీడీపీ వర్గాలు
ఎస్వీయూ నుంచీ ద్రవిడ వర్సిటీ దాకా ఇదే పరిస్థితి

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని విశ్వవిద్యాలయాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. కీలక పదవుల్లోని వీసీ, రిజిస్ట్రార్, రెక్టార్ వంటి అధికారులపై పెద్దఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. మొన్నటి దాకా వైసీపీ నేతల అండతో ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్ళాయి. కొన్ని అంశాలు హైకోర్టు దాకా వెళ్ళి విచారణలు పెండింగులో వున్నాయి. ఇపుడు ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో హడావిడిగా పలువురు తమ పదవులకు రాజీనామాలు చేస్తున్నారు. మరికొందరేమో పదవుల్లో కొనసాగేందుకు టీడీపీ నేతలను ఆశ్రయించే ప్రయత్నాల్లో వున్నారు. రాజీనామాలు చేయని వారిని తప్పుకోమంటూ టీడీపీ వర్గాలు ఆందోళనలకు దిగుతున్నాయి.తిరుపతి ఎస్వీయూ నుంచీ కుప్పంలోని ద్రవిడ వర్సిటీ దాకా ఇదే పరిస్థితి కనిపిస్తోంది.వైసీపీ ప్రభుత్వంలో అక్రమాలకు నిలయంగా మారిన వర్సిటీలు ప్రస్తుత ప్రభుత్వంలోనైనా ప్రక్షాళనకు గురవుతాయన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ద్రవిడ వర్సిటీలో ముగ్గురి రాజీనామా



కుప్పంలోని ద్రవిడ విశ్వవిద్యాలయంలో కూడా ప్రభుత్వం మారగానే గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. రిజిస్ట్రార్ వేణుగోపాల రెడ్డి, రెక్టార్ అనురాధ, అకడమిక్ డీన్ శ్రీనివాసకుమార్ రాజీనామా చేశారు. అయితే రాజీనామాలను ప్రభుత్వం ఆమోదించకపోవడంతో ప్రస్తుతానికి కొనసాగుతున్నారు. ఇక్కడ వీసీ మధుజ్యోతి గత డిసెంబరులో నియమితులయ్యారు. ఆమెపై ఎలాంటి ఆరోపణలు లేకపోయినా వర్సిటీని గాడిలో పెట్టలేకపోయారన్న విమర్శలను మూటగట్టుకున్నారు. వర్సిటీలో పనిచేస్తున్న సుమారు 240మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 11 నెలలుగా వేతనాలు చెల్లించలేని దుస్థితి నెలకొంది. ఆమె బాధ్యతలు తీసుకున్నాక కూడా వేతనాలు చెల్లింపులు జరగడం లేదు. రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తున్న వేణుగోపాల్‌రెడ్డిపై అనేక ఆరోపణలున్నాయి. ప్రభుత్వానికి కూడా పెద్ద ఎత్తున ఫిర్యాదులందాయి. కొన్ని కేసులు హైకోర్టులో కూడా పెండింగులో వున్నాయి. ఎవరు వీసీగా నియమితులైనా వర్సిటీలో పెత్తనం మాత్రం వేణుగోపాల్‌రెడ్డిదేనన్న ఆరోపణలున్నాయి.అసలు ఆయన నియామకమే అక్రమమని కొందరు హైకోర్టులో కేసు వేశారు. ఈ కేసు విచారణ పెండింగులో వుండగానే అసిస్టెంట్ ప్రొఫెసర్ నుంచీ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారన్న ఫిర్యాదులూ ప్రభుత్వానికి వెళ్ళాయి. ప్రచురణల విభాగంలో 2011 నుంచీ పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందికి 2021లో టీచర్లుగా పదోన్నతి కల్పించడంపైనా, వారికి 2011 నుంచీ అరియర్స్ చెల్లింపులు జరపడం మీదా ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్ళాయి. లబ్ధిదారుల్లో ఇదివరకటి చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి సన్నిహిత బంధువు వుండడంతో ఫిర్యాదులపై ప్రభుత్వం స్పందించలేదన్న ఆరోపణలున్నాయి.స్టడీ సెంటర్లు మూతపడడంతో వర్సిటీకి ఆదాయం పడిపోయిందని, చివరికి ఫిక్సెడ్ డిపాజిట్లు కూడా డ్రా చేసి ఖర్చు పెట్టేశారని సమాచారం. ఏటా ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్ కూడా వర్సిటీ నిర్వహణకు సరిపోవడం లేదని చెబుతున్నారు. ప్రభుత్వం మారడంతో అక్రమాలకు పాల్పడిన అధికారులు హడావిడిగా తప్పుకునేందుకు యత్నిస్తున్నారు.

కొనసాగేందుకు వీసీ యత్నాలు

ద్రవిడ వర్సిటీ వీసీగా వున్న మధుజ్యోతి తండ్రి కొలకలూరి ఇనాక్ ప్రముఖ రచయిత, విద్యావేత్త. గతంలో ఎస్వీయూ వీసీగా కూడా పనిచేశారు.ఆయన తొలుత టీడీపీ ప్రభుత్వానికి అనుకూలంగా వుండి ఎస్వీయూ వీసీగా పదవి పొందారు. తర్వాత వైసీపీ వైపు మొగ్గు చూపినట్టు ప్రచారం జరిగింది. 2014లో ఆయన మరో కుమార్తె ఆశాజ్యోతి చిత్తూరు ఎంపీగా వైసీపీ టికెట్ కోసం గట్టిగా యత్నించారు. చివరి క్షణంలో అవకాశం తప్పిపోయింది. గతేడాది డిసెంబరులో మరో కుమార్తె మధుజ్యోతి ద్రవిడ వర్సిటీ వీసీగా నియమితులయ్యారు. ఇపుడు ప్రభుత్వం మారడంతో సామాజిక వర్గాన్ని అడ్డుపెట్టుకుని ఆ వర్గ ప్రముఖుల ద్వారా మళ్ళీ టీడీపీ ప్రభుత్వ మద్దతుతో వీసీగా కొనసాగేందుకు ఆమె కుటుంబం ప్రయత్నిస్తోందని సమాచారం. అందుకే రిజిస్ట్రార్, రెక్టార్ తదితరులు రాజీనామాలు చేసినా వీసీ మధుజ్యోతి మాత్రం రాజీనామా చేయలేదని వర్సిటీ వర్గాలు చెబుతున్నాయి.

ఎస్వీయూలో పరిస్థితి అస్తవ్యస్తం

ఎస్వీయూ వీసీ వి.శ్రీకాంత్‌రెడ్డి ఛాంబర్‌లో ఇటీవల తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు బైఠాయించి మరీ ఆయన్ను పదవి నుంచీ తప్పుకోవాలని డిమాండ్ చేయడం కలకలం సృష్టించింది. ఓ విశ్వవిద్యాలయ వీసీకి తన అధికారిక ఛాంబర్‌లో ఈ తరహా అనుభవం ఎదురు కావడం నిస్సందేహంగా అభ్యంతరకరం, అనైతికం కూడా. అయితే ఈ పరిస్థితి ఏర్పడడానికి దారి తీసిన కారణాలేమిటన్నది లోతుగా తరచి చూడాల్సి వుంది. తక్షణ కారణం ఏమిటంటే 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రాగానే ఆ పార్టీ మద్దతుదారులు నాటి ఎస్వీయూ వీసీ రాజేంద్రప్రసాద్ ఛాంబర్‌లోకి, చివరికి ఆయన బంగ్లాలోకి కూడా చొరబడి పదవి నుంచీ తప్పుకోవాలని గొడవకు దిగారు. ఫోన్లు చేసి మరీ దుర్భాషలాడారు. దీంతో ఆయన తీవ్ర మనోవేదనతో వీసీ పదవి నుంచీ తప్పుకుని వెళ్ళిపోవాల్సి వచ్చింది. వర్సిటీ చరిత్రలో ఏనాడూ లేని ఈ



తరహా అనైతిక వర్తనను, అవాంఛనీయ సాంప్రదాయాన్ని ఐదేళ్ళ కిందట వైసీపీ వర్గీయులే ప్రారంభించారు. ఇపుడు టీడీపీ వర్గీయులు దానికి ప్రతీకారం తీర్చుకునే రీతిలో అదే తరహా నిరసనలకు దిగుతున్నారు. ఇది తక్షణ కారణమే కానీ ఎస్వీయూ పాలనా వ్యవహారాల్లో అనేక అడ్డగోలు నిర్ణయాలు జరిగాయనేది అసలైన కారణం. ప్రస్తుత వీసీ శ్రీకాంత్‌రెడ్డి గతేడాది డిసెంబరులో నియమితులయ్యారు. ఆయన పీలేరు నియోజకవర్గం కలకడ మండలానికి చెందిన పేరున్న రాజకీయ కుటుంబానికి చెందిన వారు. ఆయన కుటుంబం రాజకీయంగా అటు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, ఇటు మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి కూడా సన్నిహితంగా వుంటోంది. గత డిసెంబరులో మంత్రి పెద్దిరెడ్డి సిఫారసుతోనే వీసీ పదవిలో నియమితులయ్యారు. అప్పటి నుంచీ మంత్రి సిఫారసుతో సుమారు వంద దాకా తాత్కాలిక ఉద్యోగాలు భర్తీ చేశారన్న ఆరోపణలున్నాయి. అకడమిక్ కన్సల్టెంట్ల ఉద్యోగ కాలపరిమితిని 89 రోజుల నుంచీ 11 నెలలకు పొడిగించడం కూడా వివాదాస్పదమైంది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక కూడా మునుపటి తేదీ వేసి 13మంది తాత్కాలిక ఉద్యోగులను నియమించారన్న ఆరోపణలు వచ్చాయి. ఈనెల 4న ఓట్ల లెక్కింపు ఫలితాల్లో టీడీపీ అధికారంలోకి రావడం స్పష్టం కాగానే ఎస్వీయూ రిజిస్ట్రార్ హుస్సేన్ అదే రోజు తన పదవికి రాజీనామా చేశారు. ఆయన మూడేళ్ళ కిందట అప్పటి రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి సిఫారసుతో రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. వీసీ శ్రీకాంత్‌రెడ్డి కూడా తప్పుకుంటారని టీడీపీ వర్గీయులు భావించారు. అయితే శ్రీకాంత్‌రెడ్డి కుటుంబానికి మాజీ సీఎం నల్లారి కిరణ్, ఆయన సోదరుడు నల్లారి కిషోర్‌లతో సన్నిహిత సంబంధాలున్న కారణంగా వారి సిఫారసుతో పదవిలో కొనసాగేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఆ కారణంగానే టీడీపీ వర్గీయులు గట్టిగా పట్టుబడుతున్నా, చివరికి ఛాంబర్‌లోకి వెళ్ళి బైఠాయించి మరీ నిరసనలు వ్యక్తం చేస్తున్నా వీసీ స్పందించడం లేదని సమాచారం.

వెటర్నరీ వర్సిటీలో కోడ్ ఉల్లంఘనలు



తిరుపతిలోని వెటర్నరీ వర్సిటీలో ఎన్నికల కోడ్ అమల్లో వుండగానే ఉల్లంఘించి మరీ నియామకం జరిగింది.డైరెక్టర్ ఆఫ్ రీసెర్చి పోస్టు ఖాళీ కావడంతో కడప జిల్లా ప్రొద్దుటూరు వెటర్నరీ కాలేజీకి చెందిన పేథాలజీ డిపార్ట్‌మెంట్ హెడ్‌గా వున్న ప్రొఫెసర్ శ్రీలతను నియమించారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యాక జరిగిన ఈ నియామకం వాస్తవానికి ఏపీ సీఈవో నుంచీ అనుమతి తీసుకున్నాక చేపట్టాల్సి వుంది. అయితే సీఈవో లేదా ఈసీ అనుమతి లేకుండానే రిజిస్ట్రార్ తాత్కాలిక ప్రాతిపదికన నియామకం జరిపారు.తాత్కాలిక నియామకమైనా ఈసీ ముందస్తు అనుమతి తప్పనిసరి. వర్సిటీ పాలకవర్గం అనుమతి కూడా లేదు. దానికి తోడు తాత్కాలిక నియామకం కాల పరిమితి మూడు నెలలు మాత్రమే. అయితే ఏకంగా ఆరు నెలల కాలపరిమితితో ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇపుడు ప్రభుత్వం మారడంతో ఈ వ్యవహారం ఏమవుతుందోనని, కోడ్ ఉల్లంఘించి నియామకం జరిపిన అధికారులపై ఎలాంటి చర్యలు వుంటాయోనన్న చర్చ వర్సిటీలో జోరుగా నడుస్తోంది.

మహిళా వర్సిటీలో వీసీ కొనసాగే అవకాశం

పద్మావతీ మహిళా వర్సిటీ వీసీ భారతి కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆరోపణలు లేకపోవడానికి తోడు బలిజ సామాజికవర్గానికి చెందిన ఈమెకు ఆ సామాజిక వర్గం అండదండలు లభించే పరిస్థితి నెలకొంది. సౌమ్యురాలుగా, వివాద రహితురాలుగా పేరుండడంతో కొనసాగింపు సమస్య కాబోదని సమాచారం. రిజిస్ట్రార్ రజని మాత్రం కొనసాగే పరిస్థితులు కనిపించడం లేదు.





రుయాస్పత్రిలోని వసతులపై పేషెంటుతో మాట్లాడుతున్న సత్యకుమార్

ప్రభుత్వాస్పత్రుల్లో వసతుల కల్పనకు పెద్దపీట

● వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

తిరుపతి(వైద్యం), జూన్ 17 : నిరుపేదలకు కార్పొరేటు స్థాయి వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ చెప్పారు.తిరుపతిలోని రుయాస్పత్రిని ఆయన సోమవారం మధ్యాహ్నం తనిఖీ చేశారు. అత్యవసర విభాగంలో అందుతున్న సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. వారి వైద్య సేవలకు సంబంధించిన రికార్డులను పరిశీలించాక వివరాలను సూపరింటెండెంట్ రవిప్రభును అడిగి తెలుసుకున్నారు.ఓపీ కేంద్రానికి వెళ్లి క్యూలో వున్న రోగులతో మాట్లాడి ఓపీ స్లిప్పులను పరిశీలించారు. మెడిసిన్ వార్డులో రోగులతో పాటు వారి సహాయకులతో కూడా మాట్లాడారు.వార్డుల్లో నీటి సమస్య వుందని రోగులు ఆయన దృష్టికి తీసుకురాగా వెంటనే సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు.రేడియాలజీ విభాగంలో సరైన వసతులు లేకపోవడాన్ని గుర్తించి మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సూపరింటెండెంట్ ఛాంబర్‌లో వైద్యాధికారులతో ఆస్పత్రి పరిస్థితిపై సమీక్షించారు.గత ప్రభుత్వం సూపర్ స్పెషాలిటీ సేవలను అందించాలని కొంత మంది వైద్యులనే నియమించిందని, వైద్య పరికరాలు, గదుల కొరత ఉందని ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, సూపరింటెండెంట్ రవిప్రభ ఆయన దృష్టికి తీసుకువచ్చారు.వీటినంత త్వరలోనే సమస్యలన్నీ పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మంత్రి హామీ ఇచ్చారు.డీఎంహెచ్‌వో శ్రీహరి, డిప్యూటీ సూపరింటెండెంట్ సుబ్బారావు, సీఎస్ఆర్ఎంవో లక్ష్మానాయక్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, బీజేపీ నేతలు భాను ప్రకాష్‌రెడ్డి,సామంచి శ్రీనివాస్ , శ్రీహరిరావు, సుబ్రహ్మణ్య యాదవ్, చిట్టిబాబు, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో మధ్యప్రదేశ్ న్యాయమూర్తి



జస్టిస్ రాజేంద్రకుమార్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఏఈవో

ఐరాల(కాణిపాకం), జూన్ 17: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని సోమవారం మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజేంద్ర కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆయనకు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

తిరుపతి బస్టాండులో బ్లేడు బ్యాచ్

గంజాయి మత్తులో యువకుల హల్‌చల్

తిరుపతి(నేరవిభాగం), జూన్ 17: తిరుపతి బస్టాండులో కొంత కాలంగా బ్లేడు బ్యాచ్‌లు హల్‌చల్ చేస్తున్నాయి. రాత్రి 10 గంటల తర్వాత గంజాయి తాగడం, ముఠాలుగా ఏర్పడి ముష్టి యుద్ధాలకు దిగడం పరిపాటిగా మారిందని ఆర్టీసీ కంట్రోలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సెక్యూరిటీ సిబ్బంది పట్టించుకోకపోవడం, పోలీసు యంత్రాంగం ఇతర విధుల్లో నిమగ్నం కావడంతో బస్టాండు ప్రాంగణం గంజాయి, బ్లేడు బ్యాచ్‌లకు షెల్టర్ జోన్లుగా మారిపోయాయి. ప్రయాణికుల ముసుగులో కూర్చుని గంజాయి తాగుతున్నారని కంట్రోలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం పీలేరు, రాయచోటి ప్లాట్‌ఫారాల వద్ద కొందరు యువకులు గంజాయి మత్తులో గొడవలకు దిగడంతో ప్రయాణికులు భయభ్రాంతులయ్యారు. మందుబాబులతో కూడా ఇబ్బందిగా ఉందని ప్రయాణికులు చెబుతున్నారు..

శ్రీవారి సుప్రభాత సేవలో హీరో అజిత్



తిరుమలలోని అతిథిగృహంలో అజిత్

తిరుమల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తమిళ హీరో అజిత్ సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజామున ఆలయంలో జరిగిన సుప్రభాతసేవలో పాల్గొన్న ఆయన అనంతరం గర్భాలయంలోకి వెళ్లి మూలమూర్తిని దర్శించుకున్నారు. అజిత్‌కు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించారు.

హుండీ ఆదాయం రూ.4 కోట్లు: తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఆదివారం 69,870 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 42,119 మంది తలనీలాలు సమర్పించారు.

తిరుమలలో తగ్గుతున్న భక్తుల రద్దీ

శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటలు

తిరుమల, జూన్17(ఆంధ్రజ్యోతి): గత మూడురోజులతో పోలిస్తే తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ తగ్గుముఖం పట్టింది. 15, 16, 17వ తేదీ వరకు వరుస సెలవులు కావడంతో శని, ఆదివారాలు తిరుమల క్షేత్రం భారీ భక్తుల సంఖ్యతో కిక్కిరిసిపోయిన విషయం తెలిసిందే. మంగళవారం నుంచి పనిరోజులు మొదలుకానున్న నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం నుంచి తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య తగ్గింది. కంపార్టుమెంట్లలో, నారాయణగిరి షెడ్లలో ఉన్న భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఆక్టోపస్ భవనం వరకు ఉన్న క్యూలైన్ బాటగంగమ్మ ఆలయం వరకు తగ్గింది. 36 గంటలు ఉన్న దర్శన సమయం 24 గంటలకు తగ్గింది. మంగళవారం ఉదయానికి రద్దీ మరింత తగ్గే అవకాశాలున్నాయి.

నెలాఖరు వరకు సెలవు పొడిగించండి

సీఎస్‌కు ధర్మారెడ్డి అభ్యర్థన

తిరుమల, జూన్ 17(ఆంధ్రజ్యోతి):ఈ నెలాఖరు వరకు తనకు సెలవు పొడిగించాలని టీటీడీ అదనపు ఈవో ఏవీ ధర్మారెడ్డి సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు లేఖ పంపారు. రాష్ట్రంలో ఎన్నికల ఫలితాల విడులైన రెండు రోజుల తరువాత ధర్మారెడ్డి తనకు సెలవు మంజూరు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సీఎం తిరుమల పర్యటనకు ముందు 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఏడు రోజుల పాటు రాష్ట్రప్రభుత్వం సెలవు మంజూరు చేసింది. కొద్దిరోజుల వ్యవధిలోనే రాష్ట్ర ప్రభుత్వం నూతన ఈవోగా శ్యామలరావును నియమించింది.ఈవో బాధ్యతలను ఆయనకు అప్పగించిన ధర్మారెడ్డి తనకు 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు లీవ్ కావాలంటూ సీఎస్‌కు లేఖలో విన్నవించుకున్నారు. ఈ నెలాఖరులో ఆయన పదవీవిరమణ చేయబోతున్న విషయం తెలిసిందే.

ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం

రెండు నెలల కాపురం తర్వాత పరార్
తెలంగాణ యువకుడిపై యువతి ఫిర్యాదు

గద్వాల క్రైం, జూన్ 17 : ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ప్రేమకు. ఆపై సహజీవనానికి దారితీసింది.రెండు నెలలు కాపురం చేశాక మళ్లీ వస్తానంటూ వెళ్లిన ఆ యువకుడు తిరిగి రానేలేదు.అతడిని వెతుక్కుంటూ తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడుకు వెళ్లిన విద్యానగర్ యువతి ఉదంతమిది. సోమవారం గద్వాల డీఎస్పీ సత్యనారాయణకు ఆమె అందజేసిన ఫిర్యాదు మేరకు వివరాలివీ. కోట మండలం, విద్యానగర్‌కు చెందిన నిహారికకు మానవపాడు మండలం ఎ.బూర్దిపాడు గ్రామానికి చెందిన బషీర్ అనే యువకుడితో ఏడాది క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారి కొద్దిరోజులు ఇద్దరూ సహజీవనం చేశారు. తనకు ఇంతకుముందే వివాహమై విడాకులు కూడా అయ్యాయని, తనకు ఇద్దరు సంతానం అని చెప్పినా కూడా బషీర్ ఎలాంటి ఇబ్బంది లేదన్నాడని నిహారిక తెలిపింది. ఈ ఏడాది మార్చి 18న ఆయన హిందూ సాంప్రదాయం ప్రకారం తాళి కట్టాడు.కొద్దిరోజులు ఇద్దరూ కాపురం చేశారు.తర్వాత తన తల్లికి ఆరోగ్యం బాగోలేదని అన్న మౌలాలీ ఫోన్ చేశాడని, వెళ్లి చూసి వస్తానని బషీర్ సొంతూరికి వెళ్లాడు. తర్వాత ఎన్నిసార్లు ఫోన్ చేసినా అందుబాటులోకి రాకపోవడంతో చివరకు నిహారిక తన భర్త ఊరికి వచ్చి గత నెల 25న శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.అయితే ఎస్‌ఐ సంతోష్ అసభ్యకరంగా మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఆమెను స్టేషన్‌లోనే ఉంచి భయభ్రాంతులకు గురిచేశాడు. సోమవారం బక్రీద్ పండుగ కనుక భర్త ఇంటికి వస్తాడని భావించి బూడిదపాడు గ్రామానికి చేరుకున్న నిహారికను బషీర్ అసభ్యకరంగా దూషిస్తూ దాడి చేశాడు. ఈ విషయాన్ని ఎస్‌ఐకి వివరించగా పట్టించుకోలేదు. దీంతో ఎస్‌ఐ సంతోష్‌పై చర్యలు తీసుకొని, తనకు న్యాయం చేయాలని డీఎస్పీ సత్యనారాయణకు సోమవారం నిహారిక ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎస్‌ఐ సంతోష్‌ను వివరణ కోరగా నిహారిక ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేననీ, అయితే కేసు వద్దంటోందన్నారు. ఇద్దరినీ కూర్చోబెట్టి రాజీచేయాలని, లేదా పరిహారం ఇప్పించేలా చూడాలని చెపుతుండడంతో అది తమ డ్యూటీ కాదని పోలీస్ స్టేషన్ బయట చూసుకోవాలని చెప్పినట్లు చెప్పారు. ఫిర్యాదు చేస్తే విచారించి కేసు నమోదు చేస్తామన్నారు.

ఘాట్‌రోడ్డులో అదుపు తప్పిన కారు

ముగురికి స్వల్పగాయాలు

తిరుమల, జూన్17(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో సోమవారం ఓ కారు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. మహారాష్ట్రకు చెందిన ఓ కుటుంబ శ్రీవారి దర్శనం ముగించుకుని కారులో తిరుగు ప్రయాణమయ్యారు. ఎలిఫెంట్ ఆర్చ్ దాటాక కారు ఒక్కసారిగా అదుపుతప్పింది. కుడి వైపు దూసుకుపోయింది. చెట్టును ఢీకొని నిలిచిపోయింది. కారులోని ముగ్గురు భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. అతివేగమే ప్రమాదానికి కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు.

తిరుమల కాటేజీలో కట్లపాము



తిరుమల, జూన్17(ఆంధ్రజ్యోతి): తిరుమల కాటేజీలో కట్లపాము భక్తులను భయాందోళనకు గురిచేసింది. సోమవారం శ్రీవారిమెట్టుకు చివరిభాగంలోని టీబీసీ 50వ నెంబరు గల గది కిటికీకి ప్రమాదకరమైన పాము చుట్టుకుని ఉండటాన్ని భక్తులు గుర్తించారు. భయంతో బయటకు వచ్చి సమీపంలోని అధికారులకు సమాచారమిచ్చారు. ఫారెస్ట్ రేంజర్ శివకోటి తన బృందంతో వెళ్లి పామును పట్టుకున్నారు. అనంతరం దట్టమైన అడవిలో విడిచి పెట్టారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగ


మదనపల్లెలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం


పీలేరు ఈద్గాహ్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మదనపల్లె అర్బన్, జూన్ 17: త్యాగం, సహనం, ఐకమత్యానికి ప్రతీ క బక్రీద్ పండుగ అని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. అల్లాహ్ దయతో ప్రజలందరూ ఆరోగ్యంగా సుఖసంతోషాలతో మెలగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముస్లింలకు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. వేలాదిగా ముస్లింలు ఈద్గాకు తరలివెళ్లి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. బక్రీద్ పండుగను ఉద్దేశించి జామియా మసీద్ మతగురువు జలాలుద్దీన్ బక్రీద్ పవిత్రమైన పండుగని, మతసామరస్యాలకు ప్రతీక అని, త్యాగ నిరతికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈద్గాలో టీడీపీ మైనార్టీ నేత ఎస్‌ఏ మస్తాన్ ప్రత్యేక పార్థనలో పాల్గొని ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. బసినికొండ పంచాయతీ డ్రైవర్స్ కాలనీలో ఈద్గాలో ముస్లింలకు మదనపల్లె మున్సిపల్ వైస్ ఛైర్మన్ జింకా వెంకటాచలపతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రహంతుల్లా, అబ్దుల్ రెహ్మాన్, చాను, షఫీ, బషీర్, గోలీ, కలాం, జావీద్, రఫీ, ఖాలూ, మురాశ, తదితరులు పాల్గొన్నారు. స్థానిక పట్టణం, మదనపనల్లె మండలంలోని ఈద్గాలో ముస్లింలు బక్రీద్ పండుగను వేడుకగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం పరస్పర శుభాకాంక్షలు తెలిపుకున్నారు. బక్రీద్‌ను పురస్కరించుకుని పేదలకు దానధర్మాలు నిర్వహించారు.

పీలేరులో: మహోన్నత త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను సోమవారం పీలేరులోని ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాహ్‌లో పండుగ సామూహిక నమాజ్ కోసం ముస్లింలు స్థానిక పెద్దపీర్ల చావిడి వద్ద నుంచి ఊరేగింపుగా మదనపల్లె మార్గంలోని ఈద్గాహ్‌కు చేరుకున్నారు. అక్కడ ముఫ్తీ అబ్దుల్లా ధార్మిక ఉపన్యాసం చేస్తూ బక్రీద్ పండుగలోని ఆధ్యాత్మిక విషయాలను వివరించారు. అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కొంత మంది నమాజు నుంచి స్థానిక ఖబరస్థాన్‌లకు చేరుకుని తమ పూర్వీకుల సమాధులను సందర్శించి వారికి నివాళులర్పించారు. తమ, తమ పూర్వీకుల పేరిట చాలా మంది ఖుర్బానీ ఇచ్చి మాంసాన్ని బంధువులు, పేదలకు పంచిపెట్టారు. పండుగ కోసం సొంతిళ్లకు చేరిన పిల్లలు, బంధువులతో పీలేరులోని అత్యధిక ముస్లింల ఇళ్లు కళకళలాడాయి. చాలా మంది తమ ఇళ్లలో స్నేహితులకు విందులు ఏర్పాటు చేశారు. పీలేరుతోపాటు తలపుల, రేగళ్లు, బోడుమల్లువారిపల్లె, ఆరంవారిపల్లె, శివరామాపురం గ్రామాల్లోనూ పండుగ నమాజును ఈద్గాహ్‌లలో ఆచరించారు. పండుగ సందర్భంగా పీలేరు-మదనపల్లె మార్గంలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పీలేరు అర్బన్ సీఐ మోహన్ రెడ్డి, ఎస్ఐలు నరసింహుడు, రమణ తమ సిబ్బందితో పటిష్ట చర్యలు చేపట్టారు.

ములకలచెరువులో: మండలంలో సోమవారం బక్రీద్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ములకలచెరువు, బురకాయలకోట, దేవళచెరువు, చౌడసముద్రం, కదిరినాథునికోట, సోంపల్లె తదితర గ్రామాల్లో ముస్లింలు ఈద్గాల వద్ద సాముహిక పార్థనలు జరిపారు. ములకలచెరువులో పెద్ద ఎత్తున ముస్లింలు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. అనంతరం ఖుర్బాని ఇచ్చారు.

పెద్దమండ్యంలో: పెద్దమండ్యం మండలంలో ముస్లింలు బక్రీద్ పండుగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. త్యాగాలకు ప్రతీకగా జరిగిన ఈ పండుగ సందర్భంగా ముస్లింలు ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక నమాజ్‌లు చేశారు. పెద్దమండ్యం, కలిచెర్ల, తురకపల్లి, వెలిగల్లు, శివపురం, సిద్దవరం, పాపేపల్లి, గురివిరెడ్డిగారిపల్లి, గుడిసెవారిపల్లి, ముసలికుంట, బండ్రేవు గ్రామాలలో పండుగ వేడుకలు జరిగాయి. హజరత్‌లు, మత పెద్దలు, సర్పంచ్ బాష, బాబాబేగ్, నజీర్‌అహ్మద్, చాంద్ బాషా, వుస్సేన్‌సాబ్, రెడ్డిగౌస్, షుకూర్, పీరాన్‌సాబ్ పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: పీటీఎం మండలంలోని పలు గ్రామాల్లో బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని పీటీఎం, రంగసముద్రం, విసనకర్రవాండ్లపల్లె, పులికల్లు కందుకూరు, చెన్నరాయునిపల్లె, మల్లెల, మద్దయ్యగారిపల్లె గ్రామాల్లో ముస్లింలు ఉదయం నుంచి ఆయా గ్రామాల్లో ఉన్న ఈద్గాల వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

రామసముద్రంలో: రామసముద్రం మండల కేంద్రం, తిరుమలరెడ్డిపల్లె, గొల్లపల్లె, చెంబకూరులోని ముస్లింలు బక్రీద్ వేడుకలను సోమవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. దిగువపేట మసీద్ నుంచి బజారువీధి గుండా శ్రీనివాసపురం రోడ్డులో ఉన్న ఈద్గా వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువు ఉసామ్, ముత్వల్లి సిరాజ్ బాషా మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతీక అని అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఎస్ఐ చంద్రశేఖర్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. ఈ ప్రార్థన కార్యక్రమంలో మత పెద్దలు, మైనార్టీలు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం మండల వ్యాప్తంగా సోమవారం బక్రీద్ పండుగ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజాము నుంచి అన్ని మసీదులలో ప్రార్థనలు జరిగాయి. అనంతరం మండలంవలోని పట్టణంలోని ముస్లింలు ప్రదర్శనగా బయలుదేరి స్థానిక నమాజ్‌కట్టవీధి, బైపాస్ రోడ్డులోని ఈద్గాల వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నిరుపేదలకు దానధర్మాదిలు చేశారు. స్థానిక దర్గాలో పెద్దల సమాదుల చెంత .ప్రార్థనలు చేశారు. మండలంలోని చింతపర్తి, గండబోయనపల్లె, టేకలకోన, మంచూరు, మాధవరంపల్లె, తదితర ప్రాంతాలలో బక్రీద్ పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా ఖుర్బాని పంపిణీ చేసి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమాలలో మత పెద్దలు, పీలేరు టీడీపీ మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా ముస్లింలు పాల్గొన్నారు.

గుర్రంకొండలో: బక్రీద్ పండును ముస్లీంలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇందులో భాగంగా ఉదయాన్నే ఈద్గాల వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతగురువులు చెప్పిన సందేహాన్ని ఆలకించారు. అనంతరం పండుగ శుభాకాంక్షలను తెలుపుకున్నారు.

కలకడలో: బక్రీద్ పండుగను ముస్లీంలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని కలకడ, ఎర్రయ్యగారిపల్లె, పాపిరెడ్డిగారిపల్లె, ఎర్రకోటపల్లె, కోన, బంగారువాండ్లపల్లె గ్రామాల్లో ఈద్గాలో ప్రార్థనలు చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

తంబళ్లపల్లెలో: త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పండుగను తంబళ్లపల్లె మండల వ్యాప్తంగా ముస్లీంలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. సోమవారం ఉదయమే ఈద్గా, మసీదుల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తంబళ్లపల్లెలో ముస్లీంలు పెద్ద మసీదు నుంచి సిద్దారెడ్డిగారిపల్లె ఈద్గా వద్దకు ర్యాలీగా వెళ్లి ప్రార్థనలు చేశారు.

కురబలకోటలో: త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగను జరుపుకుంటున్నామని మతగురువు హజరత్ ఇస్మాయిల్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని అంగళ్లు, కురబలకోట, ముదివేడు, సాహెబులవారిపల్లె, చేనేతనగర్, మొలకవారిపల్లె,నందిరెడ్డిగారిపల్లె తదితర గ్రామాల్లో బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈద్గాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నిమ్మనపల్లిలో: మండలంలోని ముష్టూరు, చల్లావారిపల్లి, సైదాపేట, సింగంవారిపల్లి, వెంకోజిగారిపల్లి, పిట్టావాండ్లపల్లి, రాచవేటివారిపల్లి తదితర గ్రామాలలో ముస్లింలు సోమవారం బక్రీద్ పండును ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్బంగా మసీదు నుంచి బయలు దేరి అల్లాను స్మరిస్తూ ఈద్గా వద్దకు చేరుకొని ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకొంటూ బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.


ములకలచెరువులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


కురబలకోటలో ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం


పీటీఎం మండలం కందుకూరులో ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


నిమ్మనపల్లెలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


వాల్మీకిపురం పట్టణంలో ఈద్గాల వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


కలకడలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న మున్సిపల్ వైస్ ఛైర్మన్ జింకా వెంకటాచలపతి

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

తంబళ్లపల్లె, జూన్ 17: తంబళ్లపల్లె సివిల్ కోర్టులో ఈ నెల 29న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, స్థానిక న్యాయమూర్తి ఉమర్‌ఫరూక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోక్‌అదాలత్‌లో రాజీకి అవకాశం ఉన్న క్రిమినల్, సివిల్ కేసులు, కుటుంబ తగాదాకు సంబంధించిన కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మోటార్ వెహికల్‌కు సంబంధించిన కేసులతో పెండింగ్‌లో ఉన్న కేసులను ఇరువర్గాల సమ్మతితో పరిష్క రించుకోవచ్చన్నారు. లోక్‌అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయం, డబ్బు వృథా కాకుండా సత్వర న్యాయం పొందవచ్చునా న్నరు. లోక్‌అదాలత్‌కు కక్షిదారులు హాజరై పెండింగ్‌కేసులను పరిష్కరించుకోవాలని కోరారు.

కుమార్తెను తీసుకెళ్లాడని ప్రత్యర్థి కుటుంబంపై దాడి

మదనపల్లె టౌన్, జూన్ 17: ప్రేమ పేరుతో తమ కుమార్తెను ఇంటి నుంచి తీసుకెళ్లాడనే ఆగ్రహంతో ఓ యువకుడి కుటుంబంపై బాధితులు దాడి చేశారు. కురబలకోట మండల తెట్టు హరిజనవాడకు చెందిన వీరభద్ర(50), బయమ్మ(45) దంపతుల కుమారుడు బాలరాజు(25) ఓ అమ్మాయిని ప్రేమించాడు. ఈ విషయమై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఇరు వర్గాలను పిలిచిన పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. అప్పట్లో రాజీ పడిన ఇరు వర్గాలు కొద్దిరోజులు నిమ్మకుండి పోయారు. కాగా ఇటీవల బాలరాజు ప్రేమించిన అమ్మాయిని ఇంటి నుంచి ఎవరికి తెలియకుండా తీసుకెళ్లిపోయాడు. దీనిపై ఆగ్రహించిన అమ్మాయి తరుపు వారు బాలరాజు తండ్రి వీరభద్ర, తల్లి బయమ్మ, అమ్మమ్మ వెంకటమ్మలపై దాడి చేసి గాయపరిచారు. గాయాలపాలైన వారు ముగ్గురు మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ఈమేరకు అవుట్ పోస్టు పోలీసులు ముదివేడు స్టేషన్‌కు సమాచారం అందించారు.

కంపెనీ డబ్బులు కాజేసిన కేసులో యవకుడు అరెస్టు

మదనపల్లె అర్బన్, జూన్ 17: స్థానిక దేవతా నగర్‌లోని ఓ కంపెనీలో డబ్బులు కాజేసి పరారైన కంపెనీ అసిస్టెంట్ మేనేజరు టి. రామచంద్ర (38)పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ శేఖర్ తెలిపారు. తమిళ నాడు రాష్ట్రం, కరూర్ జిల్లా సెంబియనాదం గ్రామానికి చెందిన. రామచంద్ర అసిస్టెంట్ మేనేజరుగా పని చేస్తూ కలెక్షన్ బాయ్స్ తెచ్చిన కంపెనీ డబ్బులు రూ. 7లక్షలు తీసుకుని పరారయ్యాడు. ఈ సమయంలో మేనేజరు 15 రోజులు సెలవులో ఉండడంతో కలెక్షన్ నగదు అతనికి ఇచ్చారు. ఇదే అదునుగా చూసుకుని నగదుతో అతను పరారయ్యాడు. తమిళ నాడు రాష్ట్రం, దిండు గల్లు జిల్లా చెందిన కె. కార్తీక్ (39)ఫిర్యాదు మేరకు రామచంద్రపై మే 30వ తేదీన కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. నిందితుడిని స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

కడప- బెంగుళూరు రైల్వేలైన్‌ను పూర్తి చేయాలి : సీపీఐ

రాయచోటిటౌన్, జూన్ 17: కడప- బెంగుళూరు రైల్వేలైన్ పనుల పూర్తికి నూతన ప్రభుత్వం చొరవ చూపాలని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ 2009లో ప్రారంభమైన కడప- బెంగుళూరు రైల్వేలైన్ కొంతమేర పనులు జరిగి అర్థాంతరంగా ఆగిపోయాయన్నారు. నాడు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం పూర్తిగా కడప- బెంగుళూరు రైల్వేలైన్ అసైన్మెంట్‌ను వారి సొంత ప్రాంతాలు మీదుగా ఏర్పాటు చేసుకున్నారని ఆరోపించారు. తద్వారా నూతనంగా ఏర్పడిన అన్నమయ్య జిల్లా ప్రాంత ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి జక్కుల వెంకటేశ్, సీపీఐ నాయకులు ఎంఆర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు బక్రీద్ శుభాకాంక్షలు

మదనపల్లె అర్బన్, జూన్ 17: స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు బక్రీద్ సందర్భంగా శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. పట్టణంలోని ముస్లిం మైనార్టీలు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వాల్మీకి సంఘం నాయకులు నల్లబోతులు సుదర్శన్‌బాబు, పొదల నరసింహులు, మేకల విజయ్‌మోహన్, కొత్తఉడుం శంకర, పూలకుంట్ల హరి తదితరులు కలిసి బక్రీద్ పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. మదనపల్లె కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ నాయకుడు రెడ్డిసాహెబ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ అంటే త్యాగానికి ప్రతీక అని, ఇబ్రహీం ప్రవక్త ఆచరించిన మా ర్గం ప్రతి ఒక ముస్లింకి ఆదర్శనీయమన్నారు.

కోళ్లబైలులో అక్రమాలను అరికట్టాలి


కోళ్లబైలు పంచాయతీలో ధర్నా చేస్తున్న ప్రజలు

మదనపల్లె అర్బన్, జూన్ 17: మండలంలోని కోళ్లబైలు పంచాయతీ అక్రమాలను, భూకబ్జాలను అరికట్టాలని సోమవారం ప్రజలు వైఎస్సార్ కాలనీ. బయ్యారెడ్డి కాలనీల్లో ధర్నా చేశారు. రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలంగా గుర్తించి హెచ్చరిక బోర్డులు నాటినా ఖాతర్ చేయకుండా అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కొంతమంది నకిలీ పట్టాలు సృష్టించుకుని రాత్రికి రాత్రే నిర్మాణాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంగా రెవెన్యూ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని వారు వాపోతున్నారు. గత జగన్ ప్రభుత్వం అక్రమార్కులకు ఒత్తాసు పలికిందని వారు ఆరోపించారు. ప్రస్తుతం టీడీపీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రత్యేకంగా చొరవ చూపి ప్రభుత్వ స్థలాలను కాలనీల్లో కమ్యూనిటీ, పార్కుల కోసం కేటాయించాలని వారు కోరారు. కార్యక్రమంలో రెడ్డి, చలపతి, ఉపసర్పంచ్ భర్త నాగరాజ, అంజి, రాము, నరేష్‌రాజు, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

జీవో 117 రద్దు చేయాలి

- ఉపాధ్యాయులను బోధనేతర పనులు తప్పించాలి
- ఏపీటీఎఫ్ నేత డిమాండు

కలికిరి, జూన్ 17: గత ప్రభుత్వం ఏకపక్షంగా తెచ్చిన 117 జీవోను తక్షణం రద్దు చేయాలని అన్నమయ్య జిల్లా ఏపీ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు కుమార్ యాదవ్ డిమాండు చేశారు. సోమవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. పాఠశాలల మనుగడకు ముప్పు కలిగిస్తున్న ఈ జీవో కారణంగా 3, 4, 5 తరగతుల విలీనం ప్రక్రియను కూడా వెంటనే రద్దు చేయాలని ఆయన కోరారు. తరగతులను విలీనం చేయడం ద్వారా విద్యార్థుల సంఖ్య తగ్గిపోయి పాఠశాలలను మూసివేస్తున్న కారణంగా గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు విద్య దూరమవేతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇది విద్యా హక్కు చట్టాన్ని ఉల్లంఘించడమేనని ఆయన స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల అభ్యంతరాలను పెడచెవిన పెట్టిన గత ప్రభుత్వం మొండిగా అమలు చేసి పాఠశాల విద్యను ప్రమాదకర స్థితిలో పడేసిందని కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. అదే విధంగా నాడు నేడు, పథకాల ఫొటోలు, ఆన్‌లైన్ పనిభారం వంటి బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని ఆయన కోరారు. ప్రచార యావతో ఉపాధ్యాయులపై కక్ష పూరితంగా వ్యవహరించిన విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌ను వెంటనే తొలగించి ఉపాధ్యాయుల ఆత్మస్థైర్యాన్ని, ఆత్మ గౌరవాన్ని కాపాడాల్సిందిగా కుమార్ విజ్ఞప్తి చేశారు.

మంత్రి మండిపల్లిని కలిసిన టీడీపీ నేత జయచంద్రారెడ్డి


మంత్రి మండిపల్లిని కలిసి సన్మానించిన టీడీపీ నేత జయచంద్రారెడ్డి

ములకలచెరువు, జూన్ 17: జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఆదివారం రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండ్లిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రితో కలిసి విందుకు హాజరయ్యారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో పేదల నుంచి వైసీపీ నేతలు లాక్కున్న భూములు, కబ్జా చేసిన భూ ములు తిరిగి బాధితులకు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. అనంతరం మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని టీడీపీ నేత జయ చంద్రారెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె నియోజకవర్గ ప్రచార సమన్వ యకర్త సీడు మల్లికార్జుననాయుడు, మంత్రి గిరిధర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు పాలగిరి సిద్ధా, వైజీ సురేంద్రయాదవ్, రెడ్డెప్పరెడ్డి, నాయకులు కేశవులు, మణి, అరుణ్, చిన్నరెడ్డెప్ప, గొడ్డుమూరు రవి పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గూడుపల్లెలో సోమవారం టీడీపీ, జనసేన పార్టీల జెండాల ఆవిష్కరణను ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు పంచిపెట్టారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్ మాట్లాడుతూ చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల కృషితో రాష్ట్రం అభివృద్ధివైపు నడుస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, నాయకులు నాగమల్లప్ప, సుబ్బినాయుడు, ఆంజనేయరెడ్డి, మధుసూధన్ రెడ్డి, చంద్రమోహన్, శ్రీనివాసులు, నరేష్, కోటప్ప, బాబ్‌జాన్, కృష్ణమూర్తి, అర్జున్ పాల్గొన్నారు.

మంత్రి సత్యకుమార్‌ను కలిసిన మదనపల్లె బీజేపీ నేతలు


మంత్రి సత్యకుమార్‌ను కలిసిన బీజేపీ నాయకులు

మదనపల్లె అర్బన్, జూన్ 17: తిరుపతిలో ఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్ యాదవ్‌ను సోమవారం మదనపల్లెకు చెందిన బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా మదనపల్లె బీజేపీ నేత బండి ఆనంద్ ఆధ్వర్యంలో నాయకులు మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి మదనపల్లెకు రావాలని ఆహ్వానించారు. త్వరలో మదనపల్లెకు వస్తానని మంత్రి సత్యకుమార్ యాదవ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాజశేఖర్‌రెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, మాధవ, సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు వీరాభిమాని నందినికి ఆర్థిక సాయం


నందినికి ఆర్థిక సహాయం అందిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, జూన్ 17: రాష్ట్ర ముఖ్యంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు వీరాభిమాని అయిన నందినికి టీడీపీ నేత ఆర్థిక సహాయం అందించారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ముందు ఉండవల్లికి వెళ్తున్న చంద్రబాబు కాన్వాయ్ వెంట పరుగులు తీసి, చివరికి చంద్రబాబుతో మాట్లాడి ఆయనతో ఫొటో దిగిన వీరాభిమాని నందిని విషయం పత్రికల్లో వార్త వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మదనపల్లె మండలం బసినికొండకు చెందిన వైశ్యాబ్యాంకు రిటైర్డ్ ఉద్యోగి, టీడీపీ నాయకులు రమణ నందినికి రూ.5,116 ఆర్థిక సహాయం అందించారు. సోమవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చేతుల మీదుగా రమణ ఆర్థిక సహాయాన్ని నందినికి అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో టీడీపీ గెలుపు కోసం నందిని అహర్నిశలు కష్టపడిందన్నారు. ఆమెకు టీడీపీలో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు.

మతసామరస్యంతో ప్రజలందరూ సుఖంగా ఉండాలి

మదనపల్లె టౌన్, జూన్ 17: మదనపల్లెలో ప్రజలందరు మతసామరస్యం పాటిస్తూ సుఖంగా ఉండాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. సోమవారం బక్రీద్ పండుగ సందర్భంగా నియోజకవర్గం నలుమూలల నుంచి టీడీపీ నాయకులు, అధికారులు, ప్రజలు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా నివాసానికి వచ్చి ఆయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో మదనపల్లె నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయతీలకు, మున్సిపల్ వార్డులకు టీడీపీ ఇన్‌చార్జులను నియమిస్తామని వారందరు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించి, అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోడెం సిద్దప్ప, ఆర్‌జే వెంకటేశ్, నాదెళ్ల శివన్న, షంషీర్, ఖాజా, బెల్లె ప్రసాద్, ఎంపీటీసీ హారతి, చీకిలబైలు సర్పంచ్ ప్రభాకర్, మాజీ కౌన్సిలర్లు నీలకంఠ, పులి మహాలక్ష్మి, రాధ, విజయమ్మ, నాగమణి, వినోద్, పులకుంట్ల హరి, బాలు తదితరులు పాల్గొన్నారు.

అర్చక, పురోహితులను ఆదుకుంటాం

మదనపల్లె టౌన్, జూన్ 17: మదనపల్లె నియోజకవర్గంలోని అర్చక, పురోహితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. సోమవారం స్థానిక శేషమహల్ సమీపంలో టీడీపీ సీనియర్ నాయకుడు కేహెచ్ ప్రశాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో షాజహాన్‌బాషా పాల్గొని మాట్లాడుతూ ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని, సకాలంలో వర్షాలు కురవాలని హోమాలు, యాగాలు చేసే అర్చకులు, పురోహితులు, రుత్విక్‌లు కొంత మంది పేదరికంతో ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. వారందరిని గుర్తించి వారికి ప్రత్యేకంగా ఒక కాలని ఏర్పాటు చేసి ఇళ్ల స్థలాలు కేటాయిస్తామన్నారు. అనంతరం అఖిల భారత బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ ప్రదీప్‌జ్యోతి, ఉమ్మడి జిల్లా అర్చక, పురోహిత సంఘం అధ్యక్షుడు శివకుమార్‌లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను సన్మానించారు.

కిశోర్‌ని కలిసిన తంబళ్లపల్లె టీడీపీ నేతలు


కిశోర్‌కుమార్‌ను కలిసిన రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్

కురబలకోట, జూన్ 17: తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నేతలు పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డిని కలిశారు. నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివెళ్లి దుశ్శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తమ నియోజకవర్గంలో పర్యటించాలని కోరగా, త్వరలోనే పర్యటిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నియోజకవర్గ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్, త్యాగరాజు, తెట్టు ఉపసర్పంచ్ బొగ్గుభాస్కర్, టీడీపీ నాయకులు శంకర్‌రెడ్డి, ,రుద్రబాలకృష్ణ, బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం కావడంతో తిరుమలకు కాలినడక


పాదయాత్రగా తిరుమలకు వెళ్తున్న టీడీపీ నాయకులు

ములకలచెరువు, జూన్ 17: శ్రీ సత్య సాయి జిల్లా నల్లచెరువు మండలం పెద్దయల్లం పల్లెకు చెందిన యువకులు పాదయాత్రగా తిరుమలకు వెళ్తున్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, కదిరి ఎమ్మెల్యేగా కందికుంట ప్రసాద్ గెలుపొందడంతో మొక్కుబడి తీర్చుకు నేందుకు యువకులు శ్రీనివాసులు, రమేష్, జగదీష్, శ్రీనివాసులు, లక్ష్మీపతినాయుడు, నాగరాజు, ప్రకాష్, రాజేంద్ర, రామకృష్ణలు కాలినడకన తిరుమలకు వెళ్తున్నారు. ఈ మేరకు వారు చేపట్టిన పాదయాత్ర సోమవారం ఉదయం ములకలచెరువుకు చేరుకుంది. తమ గ్రామం నుంచి తిరుమలకు 200 కిలో మీటర్లు ఉంటుందని ఐదు రోజుల్లోగా తిరు మలకు చేరుకుని స్వామి వారిని దర్శించుకుని మొక్కుబడి తీర్చుకుంటామని చెప్పారు.

మొక్కులు తీర్చుకున్న కూటమి నాయకులు

పెద్దమండ్యం, జూన్ 17: పెద్దమండ్యం మండలంలో సిద్దవరం గ్రామ పంచాయతీ లోని సిద్ధేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారికి మండల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబునాయుడు కావాలని ఎన్నికల ముందు సిద్దవరం కూటమి నాయకులు, గ్రామ ప్రజలు మొక్కుబడి చేసుకున్నారు. ఏపీ సీఎంగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారంతో సోమవారం కూటమి నేతలు స్వామి వార్లకు అభిషేకాలు, ఆకు పూజలు చేసి మొక్కుబడి తీర్చుకున్నారు. మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు నానాబాల ప్రసాద్, రామాంజులునాయుడు, రఘునాథ, నారాయణ, అమరనాథ, జయచంద్రనాథ, శంకర, పెద్దన్న, శివప్రసాద్, హర్షిత్, హరీష్, శ్రీరాములు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.